TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 91 | హైదరాబాద్ | ఆదివారం 20-09-2026 | పేజీలు: 08

## సుప్రీంకోర్టుకు దానం నాగేందర్



- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్
- అనర్హత వేటును సవాల్ చేస్తూ ఎస్ఎల్పీ
- ఇప్పటికే కేవియట్ దాఖలు చేసిన మహేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి
- దానం అనర్హతను సమర్థించిన తెలంగాణ హైకోర్టు
- ఎమ్మెల్యే పదవి ఖాళీ అవుతుందని హైకోర్టు స్పష్టీకరణ
- కొత్తగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని ఆదేశం
- దానం బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్‌లో గెలుపు
- 2024 మార్చిలో కాంగ్రెస్‌లో చేరిన దానం


2



## శ్రీరాముడిని "ఆదర్శంగా తీసుకోండి

- విద్యార్థులకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ పిలుపు
- రాముడిధైర్యసాహసాలవల్లే విశ్వామిత్రుడుఎంచుకున్నారనివెల్లడి
- భారత్‌లో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయి
- అద్భుతమైన భవిష్యత్తు దిశగా భారత్ పయనం
- 2047 వరకు అమృత్ కాలమని వ్యాఖ్య
- 20 ఏళ్లలో భారత్ జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా

2



### ఇది కాలం తెచ్చిన కరువు కాదు..

## కాంగ్రెస్ తెచ్చిన కరువు

- శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం
- గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు
- రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం
- నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు

మిగతా 2లో..

### వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు

# సూచించండి



- మామునూరు విమానాశ్రయం పనులు కీలక దశకు..
- డిసెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు
- వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేరు సూచించాలని సీఎం విజ్ఞప్తి
- భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయింపు
- అవసరమైన భూమిని ఏఏఐకి అప్పగించిన ప్రభుత్వం
- మొత్తం 953 ఎకరాల ప్రాంగణంలో విమానాశ్రయ నిర్మాణం
- నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్న ఏఏఐ
- ప్రహరీ, రన్‌వే, పార్కింగ్, సీవరేజ్ పనులకు ప్రత్యేక ప్యాకేజీలు
- టెర్మినల్, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్‌కు రూ.213.59 కోట్లు
- నవంబరు నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** వరంగల్ మామునూరు విమానాశ్రయానికి పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను కోరారు. ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. విమానాశ్రయం కేవలం రవాణా సదుపాయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వేగా నిలుస్తుందని సీఎం తెలిపారు. వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతులు, భూసేకరణ, సాంకేతిక పరిశీలన వంటి ప్రక్రియలు పూర్తికావడంతో నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చర్యలు చేపట్టింది. ఇప్పటికే రెండు ప్యాకేజీలకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**953 ఎకరాల చుట్టూ ప్రహరీ**

విమానాశ్రయ నిర్మాణానికి కేటాయించిన సుమారు 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు. రెండో ప్యాకేజీలో రన్‌వే నిర్మాణంతో పాటు విమానాశ్రయ ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు.

**రూ.213.59 కోట్లతో టెర్మినల్**

మూడో ప్యాకేజీలో ప్రధాన

మిగతా 2లో..



## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు: మోదీ

- దేశీయ నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరిగింది
- 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై భారత్ సంతకాలు
- వ్యాపారులు, రైతులు, మహిళలకు కొత్త అవకాశాలు
- యువతే దేశీయ లక్ష్యాల సాధనకు కీలకం
- యువతకు సమగ్ర అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశం
- 51 వేలకు పైగా అభ్యర్థులకు నియామక పత్రాలు
- రోజ్‌గార్ మేళాలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని
- టైర్-2, టైర్-3 నగరాల నుంచి దాదాపు సగం స్టార్టప్‌లు
- ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది
- దేశీయ నైపుణ్యాలకు అంతర్జాతీయంగా పెరుగుతున్న గుర్తింపు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** భారత్ పలు దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ యువతకు కొత్త అవకాశాలను అందిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశీయ నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. వర్చువల్‌గా నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ప్రధాని పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు 51 వేలకు పైగా నియామక పత్రాలను జారీ చేశారు.భారత్ ఇప్పటివరకు 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు

మిగతా 2లో..

## ఖైరతాబాద్ కాంగ్రెస్‌దే

- దానం నాగేందర్ విషయంలో కోర్టు తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కు చెంపపెట్టు
- పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని కేసీఆరే తెచ్చారని ఆరోపణ
- తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డిని ఉదాహరణగా ప్రస్తావన
- గెలిచిన ఎమ్మెల్యేలను చేర్చుకుని మంత్రులను చేశారని వ్యాఖ్య
- ప్రభుత్వాలను పడగొట్టడం, పార్టీలను చీల్చడం భాజపా చరిత్ర అంటూ విమర్శ
- దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను భాజపా నాశనం చేస్తోందని ఆరోపణ
- దిల్లీలో మీడియాతో మాట్లాడిన టీపీసీసీ చీఫ్
- దానం వ్యవహారం నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చ



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** దానం నాగేందర్ విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

మిగతా 2లో..

## సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉద్రిక్తత

- సుధీర్‌రెడ్డి, మధుయాస్కీ వర్గాల పరస్పర నినాదాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట
- పోలీసుల రంగప్రవేశంతో చెదరిపోయిన ఇరు వర్గాలు
- జీవో నం.118 ప్రకారం ఇళ్ల క్రమబద్ధీకరణ ధ్రువపత్రాల పంపిణీ
- కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి, పొన్నం, అజహరుద్దీన్ హాజరు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇళ్ల క్రమబద్ధీకరణ ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత మధుయాస్కీ వర్గాలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాల కార్యకర్తల మధ్య తోపులాట

మిగతా 2లో..



## జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణం అక్రమం

- నాలాపై నిర్మాణం చేపట్టారని ఎంపీ మల్లు రవి ఆరోపణ
- ఫామ్‌హౌస్‌కు అనుమతులు ఉన్నాయా? అని ప్రశ్న
- ఆస్తి ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదన్న ఎంపీ
- భూములను పరిశీలించేందుకు వెళ్లిన కాంగ్రెస్ బృందం
- అడ్డుకోబోయిన బీఆర్ఎస్ కార్యకర్తలు.. చెదరగొట్టిన పోలీసులు
- అక్రమాల నిగ్గు తేలుస్తామన్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** రంగారెడ్డి జిల్లా జన్వాడలోని ఫామ్‌హౌస్ వ్యవహారం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఫామ్‌హౌస్ నిర్మాణం, అక్కడి భూముల విషయంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం పలు ఆరోపణలు చేసింది. ఫామ్‌హౌస్‌ను నాలాపై నిర్మించారని, నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా అనే దానిపై స్పష్టత లేదని ఎంపీ మల్లు రవి ఆరోపించారు. ఫామ్‌హౌస్ ఎవరి పేరుపై ఉందో కూడా స్పష్టంగా తెలియడం లేదని ఆయన పేర్కొన్నారు. జన్వాడ ఫామ్‌హౌస్ వద్దకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం చేరుకుంది. అక్కడి భూములు, నిర్మాణాలను పరిశీలించడంతోపాటు.. భూములకు సంబంధించిన అంశాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో వచ్చినట్లు మల్లు రవి తెలిపారు. ఫామ్‌హౌస్ నిర్మాణం జరిగిన తీరుపై అధికారిక రికార్డులు, అనుమతులు, భూముల వివరాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని

మిగతా 2లో..




- గజ్వేల్‌లో 388 ఎకరాలపై రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325లో అధికారుల పరిశీలన
- కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో భూములు
- తమకూ హక్కులు ఉన్నాయంటున్న వెంకటాపూర్ వాసులు
- ఎర్రవల్లి వాటా 250 ఎకరాలేనని వాదన
- మిగిలిన భూమిపై తమకు హక్కులున్నాయని వెల్లడి
- కాస్రా, సిత్వార్ రికార్డులతో సర్వే చేయాలని డిమాండ్
- పాత రికార్డుల్లో తప్పిదాలు జరిగాయని ఆరోపణలు
- 215 మంది రైతులకు నోటీసులు ఇవ్వనున్న అధికారులు
- ఈ నెల 21 నుంచి నాలుగు విడతల్లో సర్వే

### ఎర్రవల్లి భూముల సర్వేలో

# కొత్త వివాదం

**గజ్వేల్ , (ప్రజాక్షేత్రం):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లిలో భూముల సర్వే వ్యవహారం మరో మలుపు తిరిగింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ భూముల్లో తమకూ హక్కులు ఉన్నాయంటూ శివారు వెంకటాపూర్ గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో వివాదం తెరపైకి వచ్చింది.

**388 ఎకరాల్లో తమకూ వాటా ఉందని వాదన**

సర్వే నంబర్ 325లోని మొత్తం 388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామస్థులకు సుమారు 250 ఎకరాలు మాత్రమే ఉన్నాయని వెంకటాపూర్ గ్రామస్థులు చెబుతున్నారు. మిగిలిన భూమిలో తమకు కూడా హక్కులు ఉన్నాయని పేర్కొంటున్నారు. భూముల హక్కులను పాత రికార్డుల ఆధారంగా

మిగతా 2లో..

# శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోండి

- **విద్యార్థులకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ పిలుపు**
- **రాముడి ధైర్యసాహసాల వల్లే విశ్వామిత్రుడు ఎంచుకున్నారని వెల్లడి**
- **భారత్‌లో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయి**
- **అద్భుతమైన భవిష్యత్తు దిశగా భారత్ పయనం**
- **2047 వరకు అమృత్ కాలమని వ్యాఖ్య**
- **20 ఏళ్లలో భారత్ జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీరాముడి ధైర్యసాహసాలను ప్రస్తావిస్తూ.. విశ్వామిత్రుడు రాక్షస సంహారం కోసం రాముడిని ఎంచుకోవడానికి ఆయనలోని ధైర్యమే కారణమని వివరించారు. భారత్‌లో ప్రస్తుతం విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని దోభాల్ అన్నారు. దేశం అద్భుతమైన భవిష్యత్తు దిశగా వేగంగా పయనిస్తోందని పేర్కొన్నారు. యువత తమ సామర్థ్యాలను గుర్తించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

భారత్ ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేర్కొన్నట్లుగా 2047 వరకు దేశానికి అమృత్ కాలమని దోభాల్ అన్నారు. ప్రస్తుతం 4.015 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత జీడీపీ రానున్న 20 ఏళ్లలో 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని చెప్పారు.

తన ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలను కూడా దోభాల్ విద్యార్థులతో పంచుకున్నారు. సిక్కింలో పనిచేస్తున్న సమయంలో మౌంటైన్ గైడ్‌గా పనిచేసే వ్యక్తి నుంచి మూడు విజయ సూత్రాలను నేర్చుకున్నట్లు తెలిపారు.

మొదటిది.. మనం ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నామో తెలుసుకోవడం అని దోభాల్ చెప్పారు. రెండోది.. ఎక్కడికి వెళ్లాలో స్పష్టంగా తెలుసుకోవడం, అంటే కచ్చితమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం అన్నారు. మూడోది.. లక్ష్యాన్ని చేరుకున్న తర్వాత అక్కడి నుంచి తిరిగి ఎలా రావాలో కూడా తెలుసుకోవడం అని వివరించారు. ఈ మూడు సూత్రాలను జీవితంలో పాటిస్తే విజయానికి చక్కటి మార్గం ఏర్పడుతుందని అజిత్ దోభాల్ విద్యార్థులకు సూచించారు.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు

**మొదటిపేజీ తరువాయి**

చేసిందని మోదీ తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా వ్యాపారులు, రైతులు, మహిళలు సహా వివిధ వర్గాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం పెరగడం ద్వారా దేశీయ ప్రతిభకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

దేశీయ యువతే భారత అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కీలకమని ప్రధాని అన్నారు. యువతకు సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార అవకాశాల ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.

స్టార్టప్‌లపై మాట్లాడుతూ.. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు సగం వరకు టైర్2, టైర్3 నగరాల నుంచే పుట్టుకొస్తున్నాయని మోదీ తెలిపారు. చిన్న నగరాలు, పట్టణాల్లోనూ యువతలో పారిశ్రామిక ఆలోచనలు వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందని ప్రధాని అన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో యువత పాత్ర కీలకమని, వారి నైపుణ్యాలను సరైన అవకాశాలతో అనుసంధానించడం ద్వారా భారత్ మరింత వేగంగా అభివృద్ధి చెందగలదని మోదీ పేర్కొన్నారు.

## ఇది కాలం తెచ్చిన కరువు కాదు..
# కాంగ్రెస్ తెచ్చిన కరువు

**మొదటిపేజీ తరువాయి**

మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 202425 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

"నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

# జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణం అక్రమం

**మొదటిపేజీ తరువాయి**

ఆయన అన్నారు.

**బస్సును అడ్డుకునే యత్నం**

కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం బస్సులో జన్వాడకు చేరుకున్న సమయంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బస్సును అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని పక్కకు నెట్టివేశారు. బస్సు ముందు వరుసలో ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఉన్నారు. అనంతరం కాంగ్రెస్ నేతలు ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

**ఇన్ని ఎకరాల్లో ఎలా నిర్మించారు?**

జన్వాడలో ఫామ్‌హౌస్ నిర్మాణం జరిగిన తీరుపై ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. ఇన్ని ఎకరాల్లో ఫామ్‌హౌస్‌ను ఎలా నిర్మించారని ఆయన ప్రశ్నించారు. నిర్మాణాలు, భూముల విషయంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకొస్తామని అన్నారు. ఇక్కడ ఏవైనా అక్రమాలు జరిగి ఉంటే వాటిని నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు.

**111 జీవో పరిధిలో భూముల ప్రస్తావన**

జన్వాడ పరిసరాల్లోని భూములపై కాంగ్రెస్ నేతలు 111 జీవో అంశాన్ని ప్రస్తావించారు. ఈ భూములన్నీ సత్యం రామలింగరాజుకు చెందినవని వారు పేర్కొన్నారు. 111 జీవో కింద ఆయన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భూముల యాజమాన్య హక్కులు, వాటి బదలాయింపులు, నిర్మాణాలకు సంబంధించిన అనుమతులపై పూర్తిస్థాయిలో పరిశీలన అవసరమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

**హైడ్రాతో మాట్లాడతాం**

జన్వాడలో భూములకు సంబంధించిన అక్రమాలు ఏమైనా ఉన్నాయా అనే అంశంపై హైడ్రాతో మాట్లాడతామని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తెలిపారు. భూముల రికార్డులు, నిర్మాణ అనుమతులు, నాలా పరిస్థితి తదితర అంశాలను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జన్వాడ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన వ్యవహారంలో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడమే తమ ఉద్దేశమని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు.





# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

**మొదటిపేజీ తరువాయి**

విమానాశ్రయ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ తదితర పనులను రూ.213.59 కోట్లతో చేపట్టేందుకు ప్రతిపాదించారు. ఈ పనులకు తాజాగా టెండర్లు పిలిచినట్లు సమాచారం. నవంబరు నాటికి ప్రక్రియను పూర్తి చేసి పనులను ముందుకు తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించినట్లు ఏఏఐ వర్గాలు తెలిపాయి.

**డిసెంబరులో శంకుస్థాపన?**

విమానాశ్రయ నిర్మాణ పనులకు డిసెంబరులో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఏఏఐ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ కోసం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఏఏఐకి అప్పగించింది. దీంతో మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి క్షేత్రస్థాయిలో మార్గం సుగమమైంది.

**అభివృద్ధికి కొత్త గేట్‌వే**

మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్ ప్రాంతంలో పారిశ్రామిక, పర్యాటక, విద్యా రంగాలకు ఊతం లభించే అవకాశం ఉంది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు కూడా ఇది దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమైన తెలంగాణకు మామునూరు విమానాశ్రయం కొత్త చిహ్నంగా నిలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

**పేరు కోసం ప్రజల అభిప్రాయాలు**

ఇదిలా ఉండగా.. వరంగల్ విమానాశ్రయానికి తగిన పేరు సూచించాలని సీఎం ప్రజలకు పిలుపునివ్వడం ఆసక్తికరంగా మారింది. చారిత్రక వరంగల్ నేపథ్యాన్ని ప్రతిబింబించే పేరుతో పాటు ప్రాంతీయంగా ప్రాధాన్యం ఉన్న వ్యక్తులు, అంశాల పేర్లపై ప్రజల నుంచి సూచనలు వచ్చే అవకాశం ఉంది.



# ఖైరతాబాద్ కాంగ్రెస్‌దే

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. దానం నాగేందర్ వ్యవహారంలో కోర్టు తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కు గట్టి ఎదురుదెబ్బగా మహేశ్‌కుమార్ గౌడ్ అభివర్ణించారు. కోర్టు తీర్పును కాంగ్రెస్ స్వాగతిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ ఫిరాయింపుల అంశంపై బీఆర్ఎస్, భాజపాలపై ఆయన విమర్శలు చేశారు.

**ఫిరాయింపుల సంస్కృతి కేసీఆర్‌దే**

పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని కేసీఆరే తీసుకొచ్చారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. గతంలో తెదేపా తరఫున గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను, కాంగ్రెస్ తరఫున గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రులను చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు అర్థం లేదన్నట్లుగా ఆయన వ్యాఖ్యానించారు.

**బీజేపీపైనా విమర్శలు**

ప్రభుత్వాలను పడగొట్టడం, పార్టీలను చీల్చడం భాజపా చరిత్ర అని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను భాజపా నాశనం చేస్తోందని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై కాంగ్రెస్ వైఖరిని సమర్థించుకుంటూ బీఆర్ఎస్, భాజపాలపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**ఖైరతాబాద్‌పై ధీమా**

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దానం నాగేందర్ వ్యవహారం నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంపై రాజకీయంగా ఆసక్తి నెలకొన్న వేళ.. కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఎర్రవల్లి భూముల సర్వేలో కొత్త వివాదం

**మొదటిపేజీ తరువాయి**

తేల్చాలని అధికారులను కోరుతున్నారు.

**కాస్రా, సిత్వార్ రికార్డుల ఆధారంగా సర్వే**

ప్రస్తుతం ఉన్న రికార్డుల ఆధారంగానే కాకుండా పాత కాస్రా, సిత్వార్ రికార్డులను పరిశీలించి సర్వే నిర్వహించాలని వెంకటాపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాల కారణంగానే భూ రికార్డుల్లో మార్పులు చోటుచేసుకున్నాయని వారు ఆరోపిస్తున్నారు. పాత రికార్డులను పరిశీలిస్తే వాస్తవ హక్కులు స్పష్టమవుతాయని చెబుతున్నారు.

**రైతులకు నోటీసుల జారీ**

ఇదిలా ఉండగా.. సర్వే నంబర్ 325లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. విడతల వారీగా నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 215 మంది రైతులకు నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా తాజాగా 50 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు.

**21 నుంచి నాలుగు విడతల్లో సర్వే**

సర్వే నంబర్ 325లో ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు విడతల్లో సర్వే నిర్వహించనున్నారు. నిర్ణయించిన తేదీల్లో రైతులు తమ భూముల వద్దకు హాజరై సంబంధిత వివరాలను అధికారులకు తెలియజేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. భూములకు సంబంధించిన పత్రాలు, వివరాలను అందుబాటులో ఉంచాలని అధికారులు సూచించినట్లు తెలుస్తోంది.

**హక్కులకు భంగం కలగకుండా చూడాలని విజ్ఞప్తి**

ప్రస్తుత సర్వేలో తమ హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని వెంకటాపూర్ గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. పాత రికార్డులు, భూముల అనుభవం, ప్రస్తుతం ఉన్న రెవెన్యూ వివరాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే హక్కులను నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూమికి సంబంధించి ఎర్రవల్లి, వెంకటాపూర్ గ్రామస్థుల వాదనలు భిన్నంగా ఉండటంతో.. రెవెన్యూ అధికారులు చేపడుతున్న సర్వే, పాత రికార్డుల పరిశీలనపై ఆసక్తి నెలకొంది. నాలుగు విడతల్లో జరగనున్న సర్వే పూర్తయిన తర్వాత భూముల హక్కులకు సంబంధించి మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉద్రిక్తత

**మొదటిపేజీ తరువాయి**

జరగడంతో పోలీసులు రంగంలోకి దిగి వారిని చెదరగొట్టారు.

జీవో నం.118 ప్రకారం ఇళ్ల క్రమబద్ధీకరణ ధ్రువపత్రాల జారీ కోసం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కార్యక్రమం నిర్వహించారు. ధ్రువపత్రాలు అందుకునేందుకు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత మధుయాస్కీ వర్గాలకు చెందిన కార్యకర్తల మధ్య నినాదాల పోటీ మొదలైంది. క్రమంగా పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఇరు వర్గాలను విడదీసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్ హాజరయ్యారు. మంత్రుల సమక్షంలోనే ఇరు వర్గాల మధ్య నినాదాలు, తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకోవడంతో కార్యక్రమం కొనసాగింది.



# సుప్రీంకోర్టుకు దానం నాగేందర్

- **హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్**
- **అనర్హత వేటును సవాల్ చేస్తూ ఎస్ఎల్‌పీ**
- **ఇప్పటికే కేవియట్ దాఖలు చేసిన మహేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి**
- **దానం అనర్హతను సమర్థించిన తెలంగాణ హైకోర్టు**
- **ఎమ్మెల్యే పదవి ఖాళీ అవుతుందని హైకోర్టు స్పష్టీకరణ**
- **కొత్తగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని ఆదేశం**
- **దానం బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్‌లో గెలుపు**
- **2024 మార్చిలో కాంగ్రెస్‌లో చేరిన దానం**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శనివారం మధ్యాహ్నం దానం తరఫున సుప్రీంకోర్టులో ప్రత్యేక అనుమతి పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలైనట్లు సమాచారం. హైకోర్టు తీర్పుపై తదుపరి న్యాయపోరాటానికి దానం సిద్ధమయ్యారు. ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్‌లు దాఖలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారు. అనంతరం 2024 మార్చిలో కాంగ్రెస్‌లో చేరారు. అదే ఏడాది సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే పార్టీ మారడాన్ని సవాలు చేస్తూ భాజపా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు.

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందంటూ ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. 2024 సెప్టెంబరులో అసెంబ్లీ కార్యదర్శి అనర్హత పిటిషన్లను స్పీకర్ ముందుంచి, నిర్ణయానికి సంబంధించిన షెడ్యూల్ రూపొందించాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది.

**స్పీకర్ నిర్ణయంపై హైకోర్టు జోక్యం**

దానం నాగేందర్‌తో పాటు కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కూడా స్పీకర్‌కు గడువు విధించింది. ఆ తర్వాత దానం వ్యవహారంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ మహేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు శుక్రవారం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసింది. స్పీకర్ దానం అనర్హత పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టింది. దానం ఎమ్మెల్యే పదవి ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, ఖైరతాబాద్ స్థానానికి తాజాగా ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంది.

**సుప్రీంకోర్టులో తదుపరి పోరాటం**

హైకోర్టు తీర్పుతో ఎమ్మెల్యే పదవిపై ప్రతికూల ప్రభావం పడటంతో దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తీర్పును సవాలు చేస్తూ ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. ఇదే సమయంలో మహేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి కేవియట్‌లు దాఖలు చేయడంతో దానం పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టినప్పుడు తమ వాదనలు కూడా వినాలని వారు కోరినట్లయింది.





# భీంగల్ సుందరీకరణ పై మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి

- **డివైడర్ సెంటర్ లైటింగ్‌కు నూతన విద్యుత్ బల్బుల ఏర్పాటు**

**భీంగల్,సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

భీంగల్ పట్టణంలోని ప్రధాన రహదారి పైన గల డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌లో చెడిపోయిన విద్యుత్ బల్బుల స్థానంలో నూతన విద్యుత్ బల్బులను ఏర్పాటు చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పట్టణ సుందరీకరణలో భాగంగా శనివారం క్రేన్ సహాయంతో లైట్లను ఏర్పాటు చేసే పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, మున్సిపల్ కమీషనర్ డి. గజానంద్,ప్రజా ప్రతినిధులు జే జే నర్సయ్య తదితరులు పరిశీలించారు. పట్టణంలోని డివైడర్ మధ్యలో చెడిపోయిన లైటింగ్‌ను గుర్తించి, ప్రజలకు రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు అందించేందుకు నూతన లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.పట్టణ సుందరీకరణతో పాటు రహదారులపై వెలుతురు మెరుగుపరచడంపై మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రధాన రహదారులపై డివైడర్ సెంటర్ లైటింగ్ లో చెడిపోయిన అన్ని బల్బులను తొలగించి పూర్తిస్థాయిలో కొత్త బల్బులను ఏర్పాటు చేసి మెరుగైన వెలుతురు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



# మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మాణం చేపడితే చర్యలు తప్పవు

- -నూతన గృహాలు, మడిగెలు, కమర్షియల్ షట్టర్లకు అనుమతి తప్పనిసరి
- మున్సిపల్ కమీషనర్ డి. గజానంద్



**భీంగల్,సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

భీంగల్ పట్టణ పురపాలక సంఘం పరిధిలో నూతన గృహాలు,మడిగెలు, కమర్షియల్ షట్టర్లు నిర్మించాలనుకునే వారు తప్పనిసరిగా మున్సిపల్ అనుమతి పొందిన తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్ సూచించారు. మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే నోటీసులు జారీ చేయడంతో పాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురపాలక సంఘం పరిధిలో నూతన నిర్మాణాలు చేపట్టాలనుకునే వారు ముందుగా ఆన్లైన్ విధానంలో మున్సిపల్ బిల్డింగ్ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు పరిశీలించి అనుమతి మంజూరు చేసిన అనంతరం మంజూరైన అనుమతులకు లోబడి మాత్రమే నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లయితే సంబంధిత నిర్మాణదారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో ఎన్ఫోర్స్మెంట్ టీం ద్వారా అనధికార నిర్మాణాలను తొలగించే చర్యలు కూడా చేపట్టే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. అనుమతులు పొందకుండా నిర్మాణాలు ప్రారంభించి తర్వాత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రాకుండా,కొత్త ఇళ్లు, మడిగెలు, కమర్షియల్ షట్టర్లు నిర్మించాలనుకునే వారు ముందుగానే మున్సిపల్ అధికారులను సంప్రదించిp అవసరమైన అనుమతులు పొందాలని డి.గజానంద్ కోరారు.

# గంగాసారంలో ఘర్షణ.. గాయపడిన వారిని పరామర్శించిన ఎమ్మార్పీఎస్

**యాలాల సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలం గంగాసారం గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా మాదిగలపై దాడి జరిగిందని ఆరోపిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా మాదిగ యువకులు, మహిళలపై దాడి జరిగినట్లు బాధితులు ఎమ్మార్పీఎస్ నాయకులకు వివరించారు. ఈ ఘటనలో గాయపడిన పలువురు తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని బాధితులు ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు జింగుర్తి నర్సింలు, గుట్టకింద రవికుమార్ చిట్టిగిద్ద కిష్టయ్య తదితర నాయకులు ఆసుపత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. అనంతరం స్థానిక ఎస్ఐ, డీఎస్పీతో మాట్లాడి ఘటనపై కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యాలాల్ మండల ఇంచార్జి సూర్య ప్రకాష్ మాదిగ, జిల్లా నాయకులు మహేందర్ మాదిగ, సుభాష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ యాలాల్ మండల అధ్యక్షుడిగా మెట్లి నరేష్ మాదిగ, సుధాకర్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ జిల్లా కో ఇంచార్జి శివాజీ మాదిగ, తాండూర్ మండల నాయకులు వెంకట్ మాదిగ, భరత్ మాదిగ, శ్రీశైలం మాదిగ, శివకుమార్ మాదిగ, గంగాసారం గ్రామస్థులు నర్సింలు, శివకుమార్, శ్రీనివాస్ శ్రీనివాస్, జనార్ధన్, వీరప్ప, శ్రీను, ఆనంద్, పెద్ద నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.





# విద్యారంగానికి సుమిత్రమ్మ సేవలు మరువలేనివి

- విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేశారు
- డీఈవో యాదయ్య

**వనపర్తి,సెప్టెంబరు 19 (ప్రజాక్షేత్రం):**

విద్యారంగానికి సుమిత్రమ్మ అందించిన సేవలు మరువలేనివని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. పెబ్బేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) లో ఇంగ్లీష్ సహాయ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సుమిత్రమ్మ ఆకస్మికంగా మృతి చెందడంతో శనివారం ఆమె నివాసానికి వెళ్లిన డీఈవో పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**పాఠశాల అభివృద్ధికి విశేష కృషి**

గతంలో గోపాల్పేట బాలికల పాఠశాల ఉన్నతీకరణకు సుమిత్రమ్మ విశేషంగా కృషి చేశారని డీఈవో యాదయ్య గుర్తుచేశారు. ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. విద్యార్థుల పట్ల ఆమె చూపిన ప్రేమ, ఆప్యాయత, అంకిత భావం చిరస్మరణీయమన్నారు.

**విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడ్డారు**

సుమిత్రమ్మ విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్గౌడ్ అన్నారు. విద్యార్థులతో ఆప్యాయంగా మెలుగుతూ వారి భవిష్యత్తు కోసం శ్రమించారని పేర్కొన్నారు. ఆమె సేవలను విద్యార్థులు, సహచరులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు.

**పలువురి నివాళి**

సుమిత్రమ్మ పార్థివదేహానికి ఎంఈవో జయరాములు, ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరశెట్టి, శ్రీకాంత్, సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్గౌడ్ తదితరులు నివాళులర్పించారు. ఆమె పవిత్రాత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని వారు ప్రార్థించారు.



# పినపాక పట్టీనగర్‌లో భూ రీ సర్వేకు శ్రీకారం

- కలెక్టర్ అంకిత్ పర్యవేక్షణలో క్షేత్రస్థాయి పరిశీలన
- అధికారులతో కలిసి సర్పంచ్ బానోత్ పద్మ చొరవ

**బూర్గంపహాడ్,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూముల హద్దులు, విస్తీర్ణం, హక్కులకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియ బూర్గంపహాడ్ మండలం పినపాక పట్టీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో శనివారం కొనసాగింది.జిల్లా కలెక్టర్ అంకిత్ పర్యవేక్షణలో సంబంధిత అధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల వివరాలను పరిశీలిస్తూ రీ సర్వే పనులను చేపట్టారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కె.ఆర్.కె. ప్రసాద్,జీపీ ఓ శ్రీనివాస్,ఆర్ఐ వెంకటేష్,సర్వే అధికారులు సంజీవ్, యుగంధర్,అనూష తదితరులు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు.భూముల హద్దులు, విస్తీర్ణం, అందుబాటులో ఉన్న రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తూ వివరాలను నమోదు చేశారు.సర్వే ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

**భూ సమస్యలకు చెక్ పెట్టేలా రీ సర్వే**

భూముల వివరాలు సమగ్రంగా, పక్కాగా నమోదు కావడం ద్వారా భవిష్యత్‌లో భూ హద్దులు, విస్తీర్ణం, హక్కులకు సంబంధించిన వివాదాలు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.రీ సర్వే సమయంలో భూ యజమానులు, రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించి సహకరించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి రికార్డులతో సరిపోల్చడం ద్వారా భూముల వివరాలను మరింత స్పష్టంగా నమోదు చేయనున్నట్లు తెలిపారు.

**అధికారులతో కలిసి సర్పంచ్ పరిశీలన**

రీ సర్వే ప్రక్రియలో పినపాక పట్టీనగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పద్మ, ఉపసర్పంచ్ వెంకటరమణ ప్రత్యేకంగా పాల్గొన్నారు. అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే పనులను పరిశీలించారు.గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహకారం అందిస్తూ అధికారులు, ప్రజల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ పద్మ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి భూముల వివరాలు స్పష్టంగా ఉండటం ఎంతో ముఖ్యమని అన్నారు.రీ సర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలు పక్కాగా నమోదు కావడంతో భవిష్యత్‌లో ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.అధికారులు చేపడుతున్న రీ సర్వే ప్రక్రియకు గ్రామ ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.





**పకడ్బందీగా కొనసాగుతున్న ప్రక్రియ**

జిల్లా కలెక్టర్ అంకిత్ పర్యవేక్షణతో పాటు క్షేత్రస్థాయి అధికారులు స్వయంగా భూములను పరిశీలిస్తూ రీ సర్వే నిర్వహించడంతో గ్రామస్తుల్లో నమ్మకం పెరిగింది.భూములకు సంబంధించిన వివరాలను సమగ్రంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్‌లో తలెత్తే భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బానోత్ రాజేష్‌తో పాటు పలువురు గ్రామ ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గణనాథుల నిమజ్జనం ప్రశాంతంగా సాగాలి

- నిమజ్జన వేడుకల్లో డీజేలు, బాణాసంచా నిషేధం
- వెలుతురు ఉండగానే విగ్రహాలను తరలించాలి
- సీసీ కెమెరాల నిఘాలో శోభాయాత్ర.. పటిష్ఠ బందోబస్తు
- నల్లచెరువు నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ సునితారెడ్డి

**వనపర్తి,సెప్టెంబరు 19 (ప్రజాక్షేత్రం):**

గణనాథుల నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ సునితారెడ్డి సూచించారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవ కమిటీలు సహకరించాలని కోరారు. శోభాయాత్రలో డీజేలు, బాణాసంచా కాల్చడం నిషేధమని స్పష్టం చేశారు.

వనపర్తి పట్టణంలోని నల్లచెరువు వద్ద నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని, శోభాయాత్ర మార్గాన్ని ఎస్పీ శనివారం పరిశీలించారు. డీఎస్పీ గిరిబాబు, సీఐ సుగంధరత్నం, ఎస్సైలు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**వెలుతురులోనే తరలించాలి**

గణేష్ ఉత్సవ కమిటీలు వీలైనంత త్వరగా పూజా కార్యక్రమాలను పూర్తి చేసి, వెలుతురు ఉండగానే విగ్రహాలను నిమజ్జన ప్రాంతాలకు జాగ్రత్తగా తరలించాలని ఎస్పీ సూచించారు. శోభాయాత్రలో మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలపై ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని, వాహనాల నుంచి చేతులు, కాళ్లు బయటకు పెట్టవద్దని సూచించారు.

**క్రేన్ల వద్ద అప్రమత్తత**

నిమజ్జన సమయంలో క్రేన్లను ఉపయోగించే ప్రాంతాల్లో యువత, మహిళలు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. నిమజ్జన ప్రక్రియలో సహాయకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.


**సీసీ కెమెరాల నిఘా**

శోభాయాత్ర జరిగే మార్గాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంటుందని ఎస్పీ తెలిపారు. పోలీసు పికెట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మతులు, బారికేడింగ్, విద్యుత్ దీపాలు, క్రేన్లు, తాగునీటి సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

ఉత్సవ కమిటీలు బాధ్యతగా వ్యవహరించి పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని ఎస్పీ కోరారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నవరాత్రి ఉత్సవాల ముగింపులో జరిగే నిమజ్జన కార్యక్రమాన్ని మతసామరస్యానికి ప్రతీకగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, సీఐ సుగంధరత్నం,పట్టణ ఎస్సై హరిప్రసాద్,రూరల్ ఎస్సై హృషికేష్,ట్రాఫిక్ ఎస్సై సురేందర్,మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# బీజేపీ నాయకుల ఫిర్యాదుతో.. గంటల్లోనే సమస్య పరిష్కారం

- -బీజేపీ చొరవతో ఇంటి నంబర్లు
- తహసీల్దార్ స్పందన.. సమస్య పరిష్కారం

**కామారెడ్డి,సెప్టెంబర్19 (ప్రజాక్షేత్రం):**

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ పెద్దకొడప్‌గల్ మండలానికి చెందిన బీజేపీ నాయకులు శనివారం తహసీల్దార్ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంటి నంబర్లు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో గ్రామపంచాయతీ అధికారులు సర్వే నంబర్ కేటాయించలేదనే కారణంతో ఇంటి నంబర్లు ఇవ్వలేదని లబ్ధిదారులు తెలిపారు. దీంతో విద్యుత్ మీటర్ల ఏర్పాటులోనూ ఇబ్బందులు తలెత్తి, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల ఫిర్యాదుపై స్పందించిన తహసీల్దార్ రాజశేఖర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సర్వే నంబర్ల కేటాయింపునకు చర్యలు తీసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ అధికారులు అదే రోజు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించారు.

సమస్య పరిష్కారం కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేసి, స్పందించిన అధికారులకు, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# నర్ఖూడ అంగన్వాడి కేంద్రానికి ప్రెషర్ కుక్కర్, పంపిణీ

- 2వ వార్డ్ మెంబర్ కనకమామిడి విష్ణు ముదిరాజ్

**శంషాబాద్,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ మండల పరిధిలో నర్ఖూడ గ్రామంలో అంగన్వాడి కేంద్రం యొక్క విద్యార్థులకు వంట కోసం ఫ్రెష్ కుక్కర్ రైస్ కుక్కర్, నర్ఖూడ గ్రామ పంచాయతీ 2వ వార్డు సభ్యుడు కనకమామిడి విష్ణు ముదిరాజ్ అందజేశారు.ఈ సందర్భంగా శనివారం నర్ఖూడ అంగన్వాడి కేంద్రంలోని సిబ్బందికి రైస్ కుక్కర్, అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో రైస్ కుక్కర్ లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిసి వారికి కావలసిన ప్రెషర్ కుక్కర్, రైస్ కుక్కర్ ను అందజేసినట్టు కనకమామిడి విష్ణు ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతం వినోద్ కుమార్,కర్రే గణేష్,మేడి బాయ్ శ్రీనివాస్,పర్వతం ప్రభు, మరియు అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.




# చందాపూర్‌లో తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల సమావేశం

- విద్యార్థుల ప్రగతిపై సమీక్ష.. వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి..

**వనపర్తి,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరిచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని చందాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే బొజ్జి బాబు సూచించారు. శనివారం పాఠశాలలో సమావేశం నిర్వహించారు.

**పరీక్షల ఫలితాలపై చర్చ**

విద్యార్థులు ఇటీవల నిర్వహించిన నిర్మాణాత్మక పరీక్షల్లో సాధించిన ప్రగతిపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు.తరగతుల వారీగా విద్యార్థుల విద్యా స్థాయిని సమీక్షించి ,వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయా విద్యార్థులు వెనుకబడటానికి గల కారణాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

**గైర్హాజరుపై ప్రత్యేక శ్రద్ధ**

పాఠశాలకు దీర్ఘకాలంగా హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడంతోపాటు చదువులో పురోగతి సాధించేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

**రాబోయే పరీక్షలకు సన్నద్ధత**

రాబోయే సంగ్రహణాత్మక పరీక్షలకు అన్ని తరగతుల విద్యార్థులను సన్నద్ధం చేసే అంశంపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సూచనలు, సలహాలు అందించారు. ఇంటి వద్ద కూడా పిల్లల చదువును పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు అందించిన సలహాలు,సూచనలను ఉపాధ్యాయులు స్వీకరించారు. సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు డి. శ్రీనివాస్‌రెడ్డి,వై. విష్ణు, పి. మంజుల,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# దాదాపు ఎర్రటి ఎండలో 4 గంటలు ధర్నా నిర్వహించిన బిజెపి పార్టీ

- **జూరాల ఎడమ కాలువకు సాగునీరు విడుదల చెయ్యాలి**
- **గత 10 రోజుల నుంచి ఎడమ కాలువకు సాగునీరు వదలకపోవడంతో బగ్గుమన్న బిజెపి పార్టీ**
- **పంటలు ఎండుతున్న పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం**
- **నీళ్లు వదులుతామని ఇరిగేషన్ అధికారులు విన్నపించడంతో విరమించిన ధర్నా**

**అమర చింత,సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

జూరాల డ్యాం పై బీజేపీ పార్టీ నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో బిజెపి నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కొండన్న. మాట్లాడుతూ ఎల్ నీ నో ప్రభావం ఉన్న వర్షాలు పడవు అని వాతావరణ శాఖ తెలిసిన కూడా కాంగ్రెస్ నాయకులు ముందుచూపు లేకుండా నీళ్లు పుష్కలంగా ఉన్నాయని చెప్పి రైతులను పంటలు వేసుకున్న తర్వాత నీళ్లు వదలకుండా ఉండటాని ఖండించారు మంత్రివర్యులు వాకిటి శ్రీహరి రైతుల పంటలు ఎండిపోకుండా నీళ్లు అందించాలని హెచ్చరించారు

రాష్ట్ర నాయకులు అయ్య. ప్రభాకర్ రెడ్డి గ కృష్ణా నది పరివాహక ప్రాంతంలో కోయిల్ సాగర్ సంఘం బండ బూత్పూర్ ఇతర రిజర్వాయర్లకు నీళ్లు వెళుతుంటే ప్రాజెక్టుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూరు అమరచింత పరిధి లోని పంటలకు నీళ్లు పొదలకపోవడం విడ్డూరమని ఇరిగేషన్ అధికారులపై మండిపడ్డారు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పంటలు వేసిన రైతులను నష్టపరచడం సరికాదని వెంటనే నీరు వదలని లేనిపక్షాన నీటి పారుదల శాఖ మంత్రి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని హెచ్చరించారు

ఆత్మకూరు ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ గారు మాట్లాడుతూ ప్రాజెక్టులో 8 టీఎంసీల నీళ్లు ఉన్నప్పటికీ నీరు ఎందుకు వదలడం లేదని గత 30 సంవత్సరాల్లో ఇలాంటి దుస్థితి ఎప్పుడు రాలేదని రైతులు వరి పంటలు ఎండిపోతున్నాయని మండిపడ్డారు

ఆత్మకూరు మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి రైతులను మోసం చేస్తుందని ఇప్పటికీ రైతు భరోసా కొనుగోలు చేసిన వడ్లకు బోనస్, రైతు బీమా, సబ్సిడీ విత్తనాలు పరికరాలు, ప్రధానమంత్రి ఫజల్ బీమా యోజన, అన్ని ఎత్తేసింది చాలాదన్నట్టు ఇప్పుడు రైతుల పంటలకు నీళ్లు వదలకపోవడం బాధాకరమని రైతుల కన్నీటి కష్టాలు పాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందని హెచ్చరించారు



వెంటనే అక్కడికి వచ్చిన ఇరిగేషన్ ఏ ఈ వంశీకృష్ణ పై స్థాయి అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరలో నీళ్లు పంటలకు వదులుతామని చెప్పడంతో అప్పటికే వాహనాలు మొత్తం స్తభించిపోయి ఎండలో ప్రజలు ఇబ్బంది పడడంతో బిజెపి నాయకులు ధర్నాలు విరమించడం జరిగింది

ఇట్టి కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు బి కొండన్న,అయ్య ప్రభాకర్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు మేరవ రాజు,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆత్మకూరు మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ ఆత్మకూరు అమరచింత మండల అధ్యక్షులు అశోక్ భూపాల్ యాదవ్ మల్లారెడ్డి,మంగ లావణ్య,ఉప సర్పంచ్ ఎల్లన్న,కిసాన్ మోర్చా అధ్యక్షులు కుమ్మరి మాసన్న , నరసింహ,జిల్లా నాయకులు ఆంజనేయులు ముదిరాజ్,కే ఆనంద్,మల్లేష్,నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు



# "మధ్యవర్థిత్యం 3.0 పై న్యాయ వాదుల తో సమీక్ష సమావేశం

**నంద్యాల,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

ఆత్మకూరు కోర్ట్ ఆవరణలో మధ్యవర్తుల తో మరియు న్యాయ వాదులతో శ్రీ పి. వాసు,ఆరవ అదనపు జిల్లా జడ్జి,ఫుల్ అడిషనల్ ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు చైర్మన్,జిల్లా న్యాయ సేవాదికార సంస్థ,కర్నూలు,బి. లీలా వెంకట శేషాద్రి,కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు మరియు ఆత్మకూరు మేజిస్ట్రేట్ రాహుల్ అంబేద్కర్ "మధ్యవర్తిత్వం 3.0" పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా గౌరవనీయ ప్రధాన న్యాయ మూర్తి " మధ్యవర్తిత్వం 3.0" కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను మధ్యవర్తులకు న్యాయ వాదులకు వివరించారు. కక్షి దారుల మధ్య తలెత్తే వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా, మధ్యవర్తులు తమ నైపుణ్యాలను సమర్థవంతంగా వినియోగించి, ఇరుపక్షాలకు మెరుగైన మరియు నిష్పక్షపాతమైన మధ్యవర్తిత్వ సేవలను అందించాలని కోరారు. కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ కోర్ట్ లలో పెండింగ్ లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా న్యాయవాదులు త్వరగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయవాదులు తమ సహాయ సహకారులను అందించి ఈ మధ్యవర్తిత్వ 3.0 ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నగేష్, సెక్రటరీ సుదర్శన్, న్యాయవాదులు,మీడియేటర్స్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ బైరెడ్డి శబరి

**నంద్యాల సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

నంద్యాల పార్లమెంట్ పరిధిలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సిఫారసుల మేరకు మంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి శనివారం నంద్యాల బొమ్మలసత్రం లోని ఎంపీ కార్యాలయంలో బాధితులకు చెక్కులు అందజేశారు.

నంద్యాల షేక్. అబ్దుల్ రసూల్ కు రూ. 65879 లు, పాణ్యం దూదేకుల సిద్ధమ్మ కు రూ. 31084 లు, పాణ్యం ముల్లా ఫయాజ్ ఉసెన్ కు రూ. 33625 లు, ఆళ్లగడ్డ కె. నాగిరెడ్డి కీ రూ. 22101లు, బనగానపల్లె ఎస్. బాల తిమ్మారెడ్డి (డెత్ ) కి రూ. 1,23,370 లు, డోన్ మలిరెడ్డి శ్రావణి కి రూ. 81238 లు, కోవెలకుంట్ల సుంకేసుల ప్రభావతి కి రూ. 77134 లు, నంద్యాల కోనేటి చిన్నమ్మ కు రూ. 74356 లు, మహానంది పసుపులేటి నాగప్రసాద్ కు రూ. 82984 లు, నంద్యాల కె. లక్ష్మిదేవి కీ రూ. 69846 లు, నంద్యాల శిరిగిరి త్రివేణి కీ రూ. 1,05,850 లు, పాణ్యం కె. వెంకటరెడ్డి కీ రూ. 42595 లు, నంద్యాల కుమ్మరి రామసుబ్బయ్య కు రూ. 69258 లు, పాణ్యం సయ్యద్ ఉసెన్ కు రూ. 68818 లు, నంద్యాల కె. గిరిజా బాయ్ కీ రూ. 33800 లు, నంద్యాల లక్ష్మి తులసి రెడ్డి (డెత్ ) కు రూ. 30795 లు, నంద్యాల పగిడేలా పాపిరెడ్డి కి రూ. 52800 లు, డోన్ ఎ. చంద్రశేఖర్ రెడ్డి కి రూ. 95185 లు, నంద్యాల షేక్. మౌలాలి కి రూ. 30000 లు, ఆళ్లగడ్డ పచ్చర్ల రాముడు కు రూ. 30000 లు, దీబగుంట్ల జి. విజయ నరసింహుడు కు రూ. 61441 లు, నందికొట్కూరు పి. రమణమ్మ కు రూ. 51811 లు, నంద్యాల ఎం. వెంకటసుబ్బన్న కు రూ. 1,20,962 లు, పాణ్యం జి. కృష్ణవేణి కి రూ. 70000 లు ఇలా మొత్తం 24 మందికి రూ. 15,24,932 లక్షల చెక్కులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న భాధితులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# మోడల్ కళాశాలలో ఫుడ్ పాయిజన్

**ధన్వాడ,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం)**

నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ కళాశాల లో శనివారం ఫుట్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. ఆహారం తీసుకున్న అనంతరం పదిమందికి పైగా విద్యార్థులకు తీవ్ర అ స్వస్థతకు గురైనట్లు స్థానికులు తెలిపారు. కళాశాల సిబ్బంది వారిని చికిత్స కోసం నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫుడ్ పాయిజన్ కు కారణం తెలియాల్సి ఉంది.



# నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

- **పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి**

**నంద్యాల,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

నంద్యాల జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, వెంటనే డోన్ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్,వైఎస్సార్ కాంగ్రెస్ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాంజి,షాషా, ఏఐటీయూసీ మండల కార్యదర్శి తాలూకా తిరుమలేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్,ఏఐవైఎఫ్ ఉదయ్,మధు,రైతులు రమేష్ రెడ్డి గోపి లు డిమాండ్ చేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని, రైతుల రుణాలను మాఫీ చేసి రుణాలను రీషెడ్యూల్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతు కుటుంబాల పిల్లలకు అన్ని రకాల విద్యా ఫీజులను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు కరువు పరిస్థితుల నేపథ్యంలో పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని, పశువులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు, హంద్రీనీవా కాలువ ద్వారా డోన్ నియోజకవర్గం లోని అన్ని చెరువులను నీటితో నింపి భూగర్భ జలాలను పెంచడంతో పాటు, సాగునీరు మరియు తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరువు ప్రభావంతో ప్రజలు నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో 14 రకాల నిత్యావసర సరుకులను ప్రభుత్వ స్టోర్ల ద్వారా సబ్సిడీ ధరలకు ప్రజలకు పంపిణీ చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలను అరికట్టేందుకు వ్యవసాయ కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించి, రోజుకు రూ.600 కనీస వేతనం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన గ్రామీణ ఉపాధి పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 2026-27 సంవత్సరానికి రోజువారీ వేతనం రూ.312గా ఉంది; అందువల్ల రూ.600 వేతనం అనేది ఈ ధర్నా ద్వారా చేస్తున్న అదనపు డిమాండ్‌గా ప్రభుత్వం పరిగణించాలని నాయకులు కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, పశుపోషకులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21వ తేదీన సీపీఐ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు ప్రజలు, రైతులు,వ్యవసాయ కూలీలు, విద్యార్థులు,మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.




# అబ్దుల్లాపూర్ మోక్ష కర్ర గణపతిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి


**నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

లోకేశ్వరం మండలం,అబ్దుల్లాపూర్ గ్రామంలో కొలువుదీరిన మోక్ష కర్ర గణపతిని మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి,ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అబ్దుల్లాపూర్ గ్రామానికి చేరుకున్న సందర్భంగా గ్రామస్థులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,యువకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను గణపతి మండపం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక దర్శనం కల్పించారు. గణనాథుడికి పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.

గణేష్ ఉత్సవాల సందర్భంగా అబ్దుల్లాపూర్ గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. గ్రామస్థులు,యువకులు,ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్న తీరును విఠల్ రెడ్డి అభినందించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతో పాటు పరస్పర సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాల వివరాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు వివరించారు. అనంతరం విఠల్ రెడ్డి గ్రామస్థులతో కలిసి కొద్దిసేపు ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర్ బాయి,మాజీ ఎంపీపీ లలిత, భోజన్న,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఆసమ్ మాధవ్,గైక్వాడ్ సాయినాథ్, కరండే జనార్ధన్,అబ్దుల్లాపూర్ గ్రామస్థులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో జి.జలంధర్ రెడ్డి

**వలిగొండ,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో శనివారం 'చేయూత' పింఛన్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం ముమ్మరంగా సాగింది.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో అధికారులు, ప్రజాప్రతినిధులు దరఖాస్తుదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.అర్హతలను నిశితంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలోని విద్యార్థులు,ఉపాధ్యాయుల హాజరు పట్టికలతో పాటు మధ్యాహ్న భోజన నిల్వలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి,వారికి అందుతున్న విద్యా బోధన,వసతులపై ఆరా తీశారు.మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యటనలో భాగంగా వలిగొండ పరిధిలో వివాదంలో ఉన్న ఓ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. సమస్య తీవ్రతను తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తూ ఈ వివాదాన్ని అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశంగా తీసుకుని త్వరలోనే చట్టపరిధిలో పరిష్కరిస్తామని బాధిత లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో వలిగొండ ఉపసర్పంచ్ మలుగ మాధవి వెంకటేష్,గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్,వార్డు సభ్యులు బత్తిని చిన్న నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# లక్షన్నర కుటుంబాలకు సన్నబియ్యం - కెఎల్ఆర్

- **మహేశ్వరం నియోజకవర్గంలో 1,56,451 కార్డులు**
- **అందరికీ ఆహార భద్రత "స్మార్ట్ కార్డులు' పంపిణీ**

**మహేశ్వరం,సెప్టెంబర్ 19. (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లాలో కొత్తగా ఇచ్చిన కార్డులు లక్షా 15వేలు బిఆర్ఎస్ పాలనలో పేదలు, మధ్య తరగతి ప్రజలు రేషన్ కార్డులు, సన్నబియ్యానికి నోచుకోలేదని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్త, పాత ఆహార భద్రతా కార్డులు కలిపి లక్షా 56 వేల 451 కుటుంబాలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నామని కేఎల్ఆర్ తెలిపారు. ఇప్పటికే 3నెలలకు సరిపడా సన్నబియ్యం కోటాను లబ్ధిదారులకు అందజేశామని పౌరసరఫరాలశాఖాధికారులు తెలిపారు.

లక్షన్నర ఇళ్లకు అందించిన సన్నబియ్యంతో 6.25 లక్షల మంది కుటుంబ సభ్యులు (ఇంటికి నలుగురు చొప్పున) కడుపు నిండా పౌష్ఠికాహారం తింటున్నారని లక్ష్మారెడ్డి చెప్పారు.

**బిఆర్ఎస్ పాలనలో సంక్షేమం లేదు-**
**ప్రజాపాలనలో సంక్షేమం- అభివృద్ధి**

మాజీ సీఎం కెసిఆర్ పాలనలో సంక్షోభం తప్పా... సంక్షేమం లేదని ఎద్దేవా చేశారు కిచ్చెన్న. ప్రజాపాలన అధికారంలోకి వచ్చాక పేద, మధ్యతరగతి కుటుంబాలన్నీ సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలెండర్, ఆర్టీసీ ఎవరు బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లతో కళకళలాడుతున్నారని లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ధాన్యం పండించే రైతన్నకు పెట్టుబడి సహాయం, రూ.500 బోనస్, రూ.2లక్షల ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి కే దక్కుతుందని మరోసారి కేఎల్ఆర్ స్పష్టం చేశారు.ఆహార భద్రతా స్మార్ట్ కార్డులు ప్రతీ కుటుంబానికి అందించేలా రేషన్ దుకాణాదారులు బాధ్యత తీసుకున్నారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కొత్తగా లక్షా 15వేల రేషన్ కార్డులను మంజూరు చేశామని అధికారులు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో... కందుకూర్ మండలంలో 17,266 కార్డులు, మహేశ్వరం మండలం (తుక్కుగూడ డివిజన్లు కలుపుకుని) 21,964 కార్డులు,సరూర్ నగర్, ఆర్కేపురం డివిజన్లు కలుపుకుని 63,667 రేషన్ కార్డులు,బాలాపూర్ మండలం (జల్ పల్లి,మీర్ పేట,బడంగ్ పేట డివిజన్లు కలుపుకుని) 53,554 కార్డులు ఉన్నాయి మొత్తం లక్షా 56 వేల 451 కార్డులు పంపిణీ చేశామని కేఎల్ఆర్ తెలియజేశారు.





# శంషాబాద్ పాలమాకుల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- **ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**

**శంషాబాద్,సెప్టెంబర్19 (ప్రజాక్షేత్రం)**

శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది సీఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ పట్టణంలోని మధుర నగర్ లో నివాసం ఉంటున్నారు. వారి స్వగ్రామమైన మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట్ మండలం మెట్టుగడ్డ తండా గ్రామంలో వినాయక నిమర్జనం పూర్తి చేసిన అనంతరం అక్కడి నుండి శంషాబాద్ వైపు వెళ్తున్న కార్ నంబర్ టీఎస్ 07GZ9333 కారు శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామం సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి కల్వర్టు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న కేతావత్ లిబియా (54) కేతావత్ జమున (45) మాన్సింగ్ (48) వస్తామ్(45) అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న వెంటనే శంషాబాద్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు.మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు ఈ ప్రమాదం అతివేగం వల్ల జరిగిందా లేక ఏదైనా సాంకేతిక లోపం వలన జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయంపై ఫ్యూచర్ సిటీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటామని స్పష్టం చేశారు.పరిశీలించిన వారిలో ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డిసిపి శివం ఉపాధ్యాయ, మహేశ్వరం ట్రాఫిక్ పోలీసులు,రవాణా శాఖ అధికారులు ఉన్నారు.



# విఘ్నేషా మీ చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలి

- **రాజేంద్రనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాష్**
- **శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో ఘనంగా వినాయకుడి పూజ, అన్న ప్రసాద కార్యక్రమం**

**శంషాబాద్, సెప్టెంబర్19 (ప్రజాక్షేత్రం)**

విఘ్నేషా మీ చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలని రాజేంద్రనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పి. అర్చనా జయప్రకాష్ వేడుకొన్నారు. గణపతి నవరాత్రులు భాగంగా శివరాంపల్లి ప్రశాంత్ కాలనీ పొదుపు ఆధ్వర్యంలో నిర్వహించినగణపయ్య పూజలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొదుపు సంఘం కార్యవర్గ సభ్యులు ఆర్ కమలేష్ కుమార్, ఎన్ శేఖర్, కె గణేష్, సిద్ధం శ్రీనివాస్, డి ఆంజనేయులు, పి వెంకటేష్, కే శ్రీనివాస్, మల్లేష్, వెంకటేశ్వర్లు, ఎన్.నరసింహ, మల్లికార్జున్ గౌడ్ ఇతర సభ్యులు వారిని శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అర్చకులు కుమార్ వారిని తీర్థప్రసాదులతో ఆశీర్వదించారు. అనంతరం అన్నప్రసాదాన్ని ప్రధానం చేశారు.అదేవిధంగా ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గగన్ పహాడ్ యాదయ్య,పో రెడ్డి ధర్మారెడ్డి, ఎస్ దుర్గేష్ తదితరులు ఈ పూజలో పాల్గొని తీర్థ ప్రసాదలను స్వీకరించారు. అనంతరం భక్తులు ఆటపాటలతో ఘణపయ్యను కొలిచారు.కే గణేష్, పి వెంకటేష్ దంపతులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో నిర్వహించారు.

# విద్యాభివృద్ధికి దివీస్ సహకారం

**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దివిస్ లేబరేటరీస్ అందిస్తున్న సహాయం అభినందనీయమని సంస్థాన్ నారాయణపురం మండలం వాయిల్లపల్లి సర్పంచి అయితరాజు సరళ తెలిపారు. ఆ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో దివీస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచి సరళ మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఉత్తమ విద్యతోనే విద్యార్థుల జీవితం బాగుపడుతుందని



తెలిపారు. డాక్టర్ జయంత్ కుమార్,డాక్టర్ నరేష్ ల ఆధ్వర్యంలో 144 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఔషధాలు బలవర్ధక టానికులు సర్పంచి చేతులమీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులకు రూ ఒక లక్ష 16 వేల 334 విలువైన 3033 నోట్ బుక్స్ ను విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డి,దివిస్ ప్రతినిధి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వినాయకుడి పూజలో పాల్గొన్న పోలీస్ అధికారులు

**శంషాబాద్,సెప్టెంబర్19 (ప్రజాక్షేత్రం)**

శంషాబాద్ సర్కిల్ పరిధిలోని కొత్వాల్ కూడా డివిజన్ కిషన్ గూడా సెవెన్ హిల్స్ టౌన్షిప్ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయకుడి వద్ద శంషాబాద్ ఆర్జిఐఏ సీఐ సంజీవులు,ఎస్సైలు శ్రీధర్, గోపాల్, నాయకులు రాచమల్ల సురేష్,విశ్వనాథం,బండి శ్రీకాంత్ యాదవ్,కొన్నమొల్ల శ్రీనివాస్, రాచమల్ల జయసింహ,మురళి గౌడ్ లతోపాటు పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషంగా ఉండాలని భగవంతుని వేడుకున్నట్లు తెలిపారు.అధికారులు మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం రాచమల్ల సురేష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్నదానంలో పాల్గొన్నట్లు రాచమల్ల సురేష్ తెలిపారు.



# ఏపీకి నీళ్లు పోతున్నాయి.. పాలమూరుకు ఎందుకు రావు?

- **రైతులకు ఆరు గంటల విద్యుత్తుతో సరిపెడతారా?**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం.**
- **ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలకు డిమాండ్**

**వనపర్తి,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

ప్రకృతి సమృద్ధిగా నీరు అందించినా పాలమూరు రైతులకు సాగునీరు, విద్యుత్తు అందని పరిస్థితి నెలకొందని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు,మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు.వనపర్తి నియోజకవర్గంలోని పెబ్బేరు పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో,మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి ఆయన మాట్లాడారు.

రైతులు విద్యుత్తు, సాగునీటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.

**ఆరు గంటల విద్యుత్తేనా?**

పలు ప్రాంతాల్లో ఆరు గంటలకు మించి విద్యుత్తు సరఫరా కావడం లేదని రైతులు చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. తక్కువ విద్యుత్తు పీడనం, తరచూ సరఫరా నిలిచిపోవడంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారని పేర్కొన్నారు. నీరు, విద్యుత్తు అందుబాటులో ఉన్నా రైతులకు అందించలేని పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. రెండు విద్యుత్తు ఉపకేంద్రాలను రైతులతో కలిసి పరిశీలించామని, సమస్యలపై అధికారులను ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదని చెప్పారు.

**ఏపీకి నీళ్లు.. తెలంగాణకు కష్టాలా?**

పోతిరెడ్డిపాడు, వెలుగొండ మార్గాల ద్వారా ఆంధ్రప్రదేశ్కు నీళ్లు వెళ్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. జూరాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహం లేదని, అందుకే కాలువలకు నీటి విడుదల నిలిపివేశామని అధికారులు చెబుతున్నారని అన్నారు. "ఏపీకి నీళ్లు పోతున్నప్పుడు తెలంగాణకు ఎందుకు రావు?" అని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులను తరచూ ఆన్ఆఫ్ చేయడం వల్ల ప్రయోజనం ఉండదని, ఒకసారి ప్రారంభిస్తే నిరంతరంగా నడపాల్సిన అవసరం ఉందన్నారు.

**పాలమూరుకు ఏడు లక్షల ఎకరాలకు నీరు ఇచ్చాం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి నడుస్తున్న ప్రాజెక్టులుగా మార్చామని కేటీఆర్ తెలిపారు. పాలమూరులో సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. వరదలు వచ్చినప్పుడు నీటిని మళ్లించి చెరువులు, చెక్డ్యామ్లు నింపి రైతులకు సాగునీరు అందించేవారమన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం సుమారు ఏడు మెగావాట్ల స్థాయిలో ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో స్థాపిత విద్యుత్తు సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు పెంచినట్లు చెప్పారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ వెనుకబడిందని, తమ ప్రభుత్వ కాలంలో రాష్ట్రానికి లభించిన నీటిలో 30 శాతానికి పైగా వినియోగించామని తెలిపారు.

**కృష్ణా జలాలపై ముందుచూపు లేదు**

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తమ నీటి అవసరాల కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాయని, తెలంగాణ ప్రభుత్వం మాత్రం కృష్ణా జలాల విషయంలో స్పష్టమైన కార్యాచరణతో కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు. కర్ణాటకలో ఆలమట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచే యోచన ఉందని, దాని ప్రభావం భవిష్యత్తులో పాలమూరు సాగునీటిపై పడే అవకాశం ఉందని అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పక్కనే ఉన్న కర్ణాటకను ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఆలమట్టి ఎత్తు పెంపునకు కర్ణాటక ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించే ప్రణాళికలో ఉందని పేర్కొన్నారు.



**అక్రమాలు జరిగితే బయటపెట్టాలి**

అధికారంలో ఉన్న వారు అక్రమాలు జరిగాయని భావిస్తే వాటిని బయటపెట్టి ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని కేటీఆర్ అన్నారు. రైతుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఎల్నినో పేరుతో రాష్ట్రానికి రావాల్సిన సాగునీటి హక్కులు దెబ్బతినకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి**

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల అంశాన్ని ప్రస్తావిస్తూ.. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఫిరాయింపు ఎమ్మెల్యేలకు గట్టి ఎదురుదెబ్బగా నిలిచిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్లో చేరిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ప్రజల తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. శాసనసభ పక్షం రాజ్యాంగబద్ధంగా విలీనం అయిందనే వాదనను ప్రస్తావిస్తూ, మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కూడా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**"కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కే వరకు పోరాటం"**

పాలమూరు రైతులకు కృష్ణా జలాల్లో దక్కాల్సిన వాటా అందే వరకు పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా, సొంత ప్రాంతంలోనే రైతులు విద్యుత్తు, సాగునీటి సమస్యలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతోనే ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు.ఈ విలేకరుల సమావేశంలో అల్లంపూర్ శాసనసభ్యులు విజయుడు, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి,నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో కేసులకు సత్వర పరిష్కారం

- **డబ్బు.. సమయం వృథా చేసుకోవద్దు**
- **రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో సద్వినియోగం చేసుకోవాలి**
- **వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరావు**

**వనపర్తి,సెప్టెంబరు 19 (ప్రజాక్షేత్రం):**

కోర్టుల్లో కేసులు ఉన్న వారు డబ్బు,సమయాన్ని వృథా చేసుకోకుండా మధ్యవర్తిత్వ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి బాకరాజు శ్రీనివాసరావు సూచించారు. రాజీకి అవకాశం ఉన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కేంద్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు నిర్వహించనున్న మధ్యవర్తిత్వ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం న్యాయ సేవాధికార సంస్థ కోర్టు హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**మూడో వ్యక్తి సమక్షంలో రాజీ మార్గం**

సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 89 కింద పరిగణించే ప్రత్యామ్నాయ వివాద పరిష్కార పద్ధతుల్లో మధ్యవర్తిత్వం ఒకటని జడ్జి శ్రీనివాసరావు వివరించారు. వివాదంలో ఉన్న ఇరు పక్షాలు నేరుగా విచారణ ప్రక్రియలోకి వెళ్లకుండా, తటస్థమైన మూడో వ్యక్తి సహకారంతో తమ సమస్యను పరిష్కరించుకునే విధానమే మధ్యవర్తిత్వమన్నారు.

మధ్యవర్తి ఇరు వర్గాలతో సంప్రదింపులు జరిపి వారి అభిప్రాయాలను తెలుసుకుంటారని తెలిపారు. పక్షాల మధ్య ఉన్న విభేదాలను తొలగించి, ఇరు వర్గాలకూ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రత్యేక సంప్రదింపుల నైపుణ్యాలు, సంభాషణ పద్ధతులను వినియోగిస్తారని చెప్పారు.

**నిర్ణయం పక్షాలదే**

మధ్యవర్తిత్వంలో తుది నిర్ణయం తీసుకునే అధికారం ఇరు పక్షాలకే ఉంటుందని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మధ్యవర్తి ఏది న్యాయం, ఏది సరైనది అనే విషయాన్ని నిర్ణయించరని తెలిపారు. ఒకరి అభిప్రాయాన్ని మరొకరిపై బలవంతంగా రుద్దకుండా, ఇరు వర్గాల అంగీకారంతో వివాదానికి పరిష్కారం లభించేలా మధ్యవర్తి సహకరిస్తారని వివరించారు.

**15 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు**

వనపర్తి జిల్లాలో ప్రస్తుతం 15 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు ఉన్నారని తెలిపారు. వైవాహిక వివాదాలు, ఆస్తి, భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, డబ్బు లావాదేవీలకు సంబంధించిన వివాదాలు తదితర రాజీకి అవకాశం ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

కోర్టులో కేసు ఉన్న వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి మధ్యవర్తిని ఏర్పాటు చేయాలని కోరితే, నిబంధనల ప్రకారం మధ్యవర్తిని నియమించి ఇరు వర్గాలతో చర్చలు జరిపించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. మధ్యవర్తి సూచించిన పరిష్కారాన్ని ఇరు పక్షాలు అంగీకరిస్తే, న్యాయస్థానం ద్వారా కేసును పరిష్కరించుకోవచ్చన్నారు.

**కోర్టుల చుట్టూ తిరిగే బాధ తప్పుతుంది**

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారమైతే కక్షిదారులు పదేపదే కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని తెలిపారు. సమయం, డబ్బు ఆదా అవుతాయని, నామమాత్రపు రుసుముతో కేసులను సత్వరంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. మధ్యవర్తిత్వంలో రాజీ కుదిరితే భవిష్యత్తులో కొనసాగే వ్యాజ్య ఖర్చులు కూడా తప్పుతాయని, నిబంధనల ప్రకారం కోర్టు ఫీజు వాపసు పొందే అవకాశం ఉంటుందని వివరించారు.




**న్యాయమూర్తి కూడా పంపొచ్చు**

కేసులో రాజీకి అవకాశం ఉందని న్యాయమూర్తికి అనిపిస్తే, ఆ కేసును మధ్యవర్తిత్వానికి పంపవచ్చని శ్రీనివాసరావు తెలిపారు. ఇరు పక్షాలు కోరుకున్నా విజ్ఞాపన పత్రం దాఖలు చేసి మధ్యవర్తిత్వానికి పంపాలని అభ్యర్థించవచ్చన్నారు. న్యాయమూర్తి తన విచక్షణ మేరకు కూడా కేసును మధ్యవర్తిత్వానికి పంపే అవకాశం ఉందని వివరించారు.

**గోప్యతకు ప్రాధాన్యం**

మధ్యవర్తిత్వ ప్రక్రియలో కక్షిదారులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా, అనధికారికంగా, గోప్యంగా వెల్లడించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వివాదంలోని అంశాలను పరిమితం చేసుకోవడంతో పాటు, ప్రతీకార చర్యల భయం లేకుండా తమ సమస్యలను వివరించవచ్చన్నారు. ఒకవేళ మధ్యవర్తిత్వంలో రాజీ కుదరకపోయినా, ఆ ప్రక్రియలో వెల్లడించిన విషయాలను సాధారణంగా ఒక పక్షానికి వ్యతిరేకంగా ఉపయోగించలేరని వివరించారు.

**సంబంధాల పరిరక్షణకు అవకాశం**

కేవలం కేసు పరిష్కారానికే కాకుండా ఇరు పక్షాల మధ్య ఉన్న శత్రుత్వాన్ని తగ్గించడానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కుటుంబ, వ్యక్తిగత, వ్యాపార సంబంధాలను తిరిగి పునరుద్ధరించుకోవడానికి, కొనసాగించుకోవడానికి ఇది అవకాశం కల్పిస్తుందని తెలిపారు. వ్యాజ్యంతో పోలిస్తే పరస్పర అంగీకారంతో కూడిన పరిష్కారం లభించే అవకాశం ఉండటంతో దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా ప్రజలు మధ్యవర్తిత్వ విధానంపై అవగాహన పెంచుకుని, రాజీకి అవకాశం ఉన్న కేసులను సత్వరంగా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

**హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు**

ఈ విలేకరుల సమావేశంలో ఫాస్ట్ట్రాక్ కోర్టు, పోక్సో న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్రెడ్డి,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.కళార్చన, అడిషనల్ సివిల్ జడ్జి కె.కవిత, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు కిరణ్, బార్ కౌన్సిల్ కార్యదర్శి వెంకటరమణ,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప కాసరగడ్డతో పాటు శిక్షణ పొందిన మధ్యవర్తులు పాల్గొన్నారు.

# జల్పల్లి సర్కిల్లో సర్ పై సమగ్ర సమీక్షసమావేశం

**మహేశ్వరం,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జల్పల్లి సర్కిల్ కార్యాలయంలో బూత్ లెవెల్ సూపర్వైజర్లు, అధికారులతో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ )పై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్ఓ వెంకట్ రామ్ అధికారులకు పలు సూచనలు చేశారు. నో మ్యాపింగ్, అనామలీస్కు సంబంధించిన నోటీసులను సంబంధిత ఓటర్లందరికీ అందజేయాలని ఆయన సూచించారు. నోటీసులు అందుకున్న వారు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. నిర్ణీత ప్రక్రియలో అవసరమైన పత్రాలు సమర్పించకపోతే ఓటరు జాబితాలో పేరు కొనసాగింపుపై ప్రభావం ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే ఆన్లైన్ ద్వారా అందుతున్న ఫారం6, 7, 8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు జల్పల్లి సర్కిల్ పరిధిలో సుమారు 70 శాతం నోటీసుల విచారణ పూర్తయినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

ఈ సందర్భంగా 100 శాతం నోటీసుల పంపిణీ, ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేసిన బూత్ లెవెల్ అధికారులు జ్యోతి, ఆస్మా ఫరీన్, మహమూద్ బేగం, కౌసర్ అంజుమ్, ఫహీమా ఉన్నీసా, ఆసియా బేగం అలాగే సూపర్వైజర్లు చందర్, సుధాకర్వి లను సత్కరించారు. వారిని అభినందిస్తూ, మిగిలిన అధికారులు కూడా ఈ నెల 25వ తేదీలోపు సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి. వినయ్ కుమార్,సూపర్వైజర్లు మునిరాజ్,ఆనంద్, సత్యనారాయణ,శేషారావు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.





# బాలాపూర్ మహా గణనాధుడి సేవలో అందెల శ్రీరాములు

**మహేశ్వరం,సెప్టెంబర్19 (ప్రజాక్షేత్రం):**

మహేశ్వరం నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ మహా గణనాధుడిని ఈరోజు మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు కుటుంబ సమేతంగా, బీజేపీ శ్రేణులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీరాములు గారు మాట్లాడుతూ, "బాలాపూర్ మహా గణనాధుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని, విఘ్నాలను తొలగించి ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని గణనాధుడిని ప్రార్థించానని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, మహేశ్వరం నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరగాలని, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని స్వామివారిని కోరుకున్నానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్,జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి,బీజేపీ డివిజన్ అధ్యక్షులు, పదాధికారులు,మాజీ కార్పొరేటర్లు,బీజేపీ నాయకులు,భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, కార్యకర్తలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రేపల్లె ఘటనపై ఎస్పీ పరిశీలన

- **కులాంతర వివాహం నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనపై క్షేత్రస్థాయిలో పరిస్థితుల సమీక్ష**
- **శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు తావులేదని స్పష్టం**

**జోగులాంబ గద్వాల జిల్లా, సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం రేపల్లె గ్రామంలో కులాంతర వివాహం నేపథ్యంలో చోటుచేసుకున్న ఇంటి కూల్చివేత ఘటనపై ఇప్పటికే చట్టపరమైన చర్యలు చేపట్టిన నేపథ్యంలో ,జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు,ఐపీఎస్ శనివారం సాయంత్రం రేపల్లె గ్రామాన్ని సందర్శించారు. ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి,సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు.

ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు సంయమనం పాటించాలని ఎస్పీ సూచించారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోరాదని, ఏదైనా సమస్య లేదా వివాదం ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువచ్చి చట్టపరమైన పరిష్కారం పొందాలని తెలిపారు. ఇప్పటికే ఈ ఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామని, గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య,గద్వాల రూరల్ ఎస్ఐ సీహెచ్.శ్రీకాంత్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# గొట్లపల్లిలో పంచాయతీ బిల్లుల చెల్లింపులపై విచారణ

- **ఫిర్యాదు మేరకు గ్రామపంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎంపీఓ రతన్ సింగ్**

**పెద్దేముల్,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండల పరిధిలోని గొట్లపల్లి గ్రామపంచాయతీలో గతంలో జరిగినట్లు పేర్కొంటున్న కొన్ని బిల్లుల చెల్లింపులపై ఫిర్యాదు అందడంతో శనివారం పెద్దేముల్ మండల ఎంపీఓ రతన్ సింగ్ గ్రామపంచాయతీని సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.గ్రామానికి చెందిన బి.నవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు ఈ పరిశీలన చేపట్టినట్లు ఎంపీఓ తెలిపారు.2023-24, 2026-27 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పంచాయతీ రికార్డుల్లో గతంలో గొట్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన పంచాయతీ కార్యదర్శి రాజు భార్య పేరుపై చెల్లింపులు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అదేవిధంగా ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పరమేష్ కూడా మాజీ పంచాయతీ కార్యదర్శి భార్య పేరుపై చెల్లింపులు చేసినట్లు గొట్లపల్లి గ్రామానికి చెందిన బీ.నవీన్ కుమార్ ఆరోపించారు.ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బి. నవీన్ కుమార్ అధికారులను కోరారు. ఫిర్యాదు నేపథ్యంలో ఎంపీఓ రతన్ సింగ్ గొట్లపల్లి గ్రామపంచాయతీని సందర్శించి సంబంధిత రికార్డులు, చెల్లింపులకు సంబంధించిన రికార్డులను,వివరాలను పరిశీలించారు.పరిశీలన అనంతరం తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఎంపీఓ తెలిపారు.అధికారుల నివేదిక అనంతరం చెల్లింపులకు సంబంధించిన వాస్తవాలు, నిబంధనల అమలు తదితర అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# విలువ ఆధారిత విద్య, క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

- **కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.దీపక్.**

**చేవెళ్ల, సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

విద్యార్థులు తమ జీవితంలో విజయం సాధించాలంటే విలువ ఆధారిత విద్య, స్వీయ క్రమశిక్షణ, చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించే దృక్పథం ఎంతో అవసరమని కెనరా బ్యాంక్ చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ ఎస్. దీపక్ అన్నారు. చేవెళ్లలోని బిజినెస్ స్కూల్ రియా కళాశాలలో ఎంబీఏ 22వ బ్యాచ్ ఓరియంటేషన్ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెనరా బ్యాంక్ చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ ఎస్.దీపక్ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. లక్ష్యం పట్ల కఠోర శ్రమ, అంకితభావం ఉంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా 'బ్యాంకింగ్ పరిశ్రమలోకి ఎలా ప్రవేశించాలి?' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ రంగంలో ఉన్న వివిధ కెరీర్ అవకాశాల గురించి వివరించి, వాటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మేము మౌనాన్ని పాటిస్తే బిఆర్ఎస్ నాయకుల రాజకీయం

- **బిఆర్ఎస్ మండల నాయకుల అక్రమ ఆస్తులు బయటపెడతాం**
- **బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులపై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు**
- **గిరిజనుల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం**

**మహేశ్వరం సెప్టెంబర్ 19. (ప్రజాక్షేత్రం)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో.. మాజి శాసన సభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో.... వివిధ గ్రామాల నుంచి నూతన మండల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు మాట్లాడుతూ... ఫ్యూచర్ సిటీ లో అన్ని గ్రామాలు కలపాలి అనే ఉద్దేశంతో.. జేఏసీగా ఏర్పడి అందరి మద్దతుతో.. మండల కేంద్రం లోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో.. ఆమోదం తెలపగా బిఆర్ఎస్ మండల నాయకులు మరియు సర్పంచులు.. మద్దతు తెలపకపోవడంతో.. అధికార పార్టీ నిరసనతో ర్యాలీగా వెళ్లి మహేశ్వరం మండలంలో ఉన్న అన్ని గ్రామాలు ఫ్యూచర్ సిటీలో కలపాలని తెలపడంతో.. ఒకవైపు అభివృద్ధి కోసం ప్రయత్నిస్తుంటే మరోవైపు బిఆర్ఎస్ నాయకులు స్వార్థం కోసం ఆలోచిస్తూ మద్దతు తెలుపకపోగా.. ఇంతకుముందే స్థానిక మంత్రిని కలిసాం మేము మద్దతు తెలిపాం అని ప్రకటన ఇవ్వడం సిగ్గుచేటు అని తెలియజేశారు. మీరు మద్దతు తెలిపినట్లైతే ఎంతమంది సర్పంచులు ఉన్నారో బిఆర్ఎస్ పార్టీ తరపున లికిత పూర్వకంగా రాసి మద్దతు తెలుపుతున్నట్టుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు అంతేకాకుండా గిరిజన నాయకులు మాట్లాడుతూ.. ఎవరైతే తప్పుడు ప్రచారం చేస్తున్నారో వారిపై మండిపడ్డారు. గిరిజన నాయకులను గుర్తించిందే కాంగ్రెస్ ప్రభుత్వం మీకు తెలవకపోతే మీ తాతలను గాని మీ తండ్రులను గాని అడిగి తెలుసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో తండాలను పంచాయతీలుగా విభజించి గాలికి వదిలేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీని కేఎల్ఆర్ చొరువతో అభివృద్ధి చేయడం జరుగుతుంది అన్నారు. ప్రస్తుతం ఉన్న లోకల్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్థానిక ప్రజల సమస్యలు మర్చిపోయి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యేగా ఉండి ప్రభుత్వం దగ్గర నుంచి పన్నులు తీసుకొని వచ్చి గ్రామాల అభివృద్ధి చేయవలసిన స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండిపడ్డారు.ఎవరైతే గిరిజన నాయకులు మీడియా ముందు ఎక్కువగా మాట్లాడుతున్నారో మహేశ్వరం మండలంలో ఎవరెవరి ఆస్తులు ఎన్ని ఉన్నాయో వారి అన్ని ఆస్తులు బయటికి తీస్తామని హెచ్చరించారు రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గిరిజనుల అభివృద్ధి బాటలో నడుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమం లో మహేశ్వర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య,మండలం మాజీ అధ్యక్షులు కాకి ఈశ్వర్, మహేశ్వర మండల సర్పంచ్ పోరం అధ్యక్షులు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.






# విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి

- **సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర**

**జహీరాబాద్,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

ఉపాధ్యాయయురాలు రాజశ్రీ కి సన్మానంలో సర్పంచ్ డి మచేందర్ జహీరాబాద్.బాలుడు, బాలిక పాఠశాలలో ప్రవేశించిన నాటి నుంచి ఇంట్లో కంటే పాఠశాలలోనే అధిక సమయం గడుపుతారని, అ సమయంలో పిల్లలకు ఉపాధ్యాయులు ఏ తరహా శిక్షణ అందిస్తే విద్యార్థులు అందులో నిష్ణతులవుతారని హోతి బి గ్రామ సర్పంచ్ దాసరి మచేందర్ అన్నారు. శనివారం నాడు జహిరాబాద్ మండలంలోని హోతి(బి) గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు రాజశ్రీ గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుతూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నందుకు గాను సర్పంచ్ దాసరి మచ్చేందర్ ఆమెకి ఘనంగా సన్మానం చేశారు. పాఠశాల అభివృద్ధికి, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా సర్పంచ్ కొనియాడుతూ తల్లి తండ్రుల తరువాత అంతటి స్థానం గురువులదే అని, కాబట్టి టీచర్లు కూడా కేవలం నెల నెల జీతం కోసం కాకుండా విద్యార్థులను ప్రయోజకులాగా సిద్ధం చెయ్యాలని,అటువంటి ప్రణాళికకు పెద్దపిట వెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విష్ణు,పంచాయితీ కార్యదర్శి నర్సింలు,పాఠశాల సిబ్బంది,ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కరెంటు.. సాగుకు నీళ్లు ఇవ్వాలి

- **పెబ్బేరులో కేటీఆర్ ర్యాలీ..**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

**వనపర్తి, సెప్టెంబరు 19(ప్రజాక్షేత్రం):**

రైతులకు నాణ్యమైన విద్యుత్తు, సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని సబ్‌స్టేషన్ నుంచి సుభాష్ చౌరస్తా వరకు రైతులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. రోజుకు 10-12 సార్లు కోతలు పెబ్బేరు, గుమ్మడం సబ్‌స్టేషన్లను పరిశీలించిన సందర్భంగా రైతులు విద్యుత్తు సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని కేటీఆర్ తెలిపారు. ఐదారు గంటలు కూడా సక్రమంగా విద్యుత్తు సరఫరా కావడం లేదని రైతులు చెబుతున్నారని పేర్కొన్నారు. అధికారులు మాత్రం 12 గంటల విద్యుత్తు ఇస్తున్నామని చెబుతున్నారని, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. రోజుకు 10-12 సార్లు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుండటంతో స్టార్టర్లు, మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు.

జూరాల ఆయకట్టుకు నీటి కొరత కృష్ణా నదికి 248 టీఎంసీల నీరు వచ్చినప్పటికీ పాలమూరు రైతులకు తగినంత సాగునీరు అందడం లేదని కేటీఆర్ ఆరోపించారు. జూరాల కింద కేవలం 18 టీఎంసీల నీటినే ఇచ్చారని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 10 టీఎంసీలకు మించి నీరు అందలేదని పేర్కొన్నారు. కల్వకుర్తి పంపులను సక్రమంగా నడపడం లేదని విమర్శించారు. జూరాల కింద ఉన్న లక్షా పది వేల ఎకరాల ఆయకట్టులో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా రైతుల తరపున పోరాడతామని అన్నారు. 'రైతుబంధు'పై విమర్శలు కాంగ్రెస్ ప్రభుత్వం మూడుసార్లు రైతుబంధు నిధులు నిలిపివేసిందని, రైతుబీమా ప్రీమియం విషయంలోనూ రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయని కేటీఆర్ ఆరోపించారు. సీఎం సొంత జిల్లాలోనే రైతులు విద్యుత్తు కోసం రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు దాదాపు 90 శాతం పూర్తిచేసినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం వాటిని ముందుకు తీసుకెళ్లడం లేదని విమర్శించారు.

**'పాలమూరు రైతుల కోసం పోరాటం'**

పెబ్బేరు ప్రాంతంలో వెయ్యి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారని కేటీఆర్ పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని తీసుకెళ్తున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలే బీఆర్ఎస్‌కు ముఖ్యమని, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కర్ణాటకతో చర్చించి రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "నల్లమల పులి కాదు.. చంద్రబాబు సంకలో పిల్లి" అంటూ వ్యాఖ్యానించారు.



# వినాయక సన్నిధిలో భాయ్ భాయ్.. భజన కీర్తనల్లో లీనమైన ముస్లిం సోదరుడు షేక్ హైమద్

**నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

లోకేశ్వరం మండల పరిధిలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు మతసామరస్యానికి సరికొత్త వేదికగా నిలిచాయి. కులమతాల రంగులు పక్కనబెట్టి, మానవత్వమే పరమావధిగా సాగిన ఒక అపురూప ఘట్టం ఇక్కడ ఆవిష్కృతమైంది. గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించిన మోక్షకర్త వినాయకుడి సన్నిధిలో స్థానిక యువకులు భక్తులు రాత్రి సమయం భజన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో ఒక అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. చాక్‌పల్లి గ్రామానికి చెందిన ముస్లిం సోదరుడు షేక్ హైమద్ ఈ భజన కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.కేవలం వీక్షకుడిగా పరిమితం కాకుండా గణనాథుడి మండపంలో హిందూ సోదరులతో భుజం భుజం కలిపి కూర్చున్నారు.భజన కీర్తనలు ఆలపిస్తున్న సమయంలో ఆయన స్వయంగా తాళం వేస్తూ పాటల పల్లవులను అందుకుంటూ భక్తిభావంలో లీనమైపోయారు.మతాలు వేరైనా దేవుడు ఒక్కడేననే సత్యాన్ని చాటుతూ షేక్ హైమద్ ప్రదర్శించిన ఈ భక్తిభావం అక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరినీ కదిలించింది.సమాజంలో శాంతిసౌభ్రాతృత్వాలు విలసిల్లడానికి ఇలాంటి సంఘటనలు ఎంతో దోహదపడతాయని స్థానికులు కొనియాడారు.నేటి ఆధునిక కాలంలో మనుషుల మధ్య గోడలు పెరుగుతున్న తరుణంలో,భజన కీర్తనలతో మతసామరస్యపు పరిమళాలు వెదజల్లిన ఈ ఘటన మానవత్వానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక భక్తులు,కమిటీ సభ్యులు షేక్ హైమద్‌ను ప్రత్యేకంగా అభినందించి,శాలువాతో సత్కరించారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిన ఈ ఉదంతం ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.




# జన్వాడ ఫాంహౌస్ సందర్శించిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యే ల బృందం

- **- నాలాపై జన్వాడ ఫాంహౌస్ నిర్మాణం కాంగ్రెస్ ఎంపీలు**
- **పర్యటన లో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**శంకర్ పల్లి సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

జన్వాడ ఫామ్ హౌస్ ను సందర్శించిన కాంగ్రెస్ ఎంపీలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవని, నాలాపై ఫాం హౌస్ కట్టారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం జన్వాడ ఫాంహౌసు వెళ్లింది. ఈ సందర్భంగా ఫాంహౌస్ భూములను ప్రజా ప్రతినిధుల బృందం పరిశీలించింది. అనంతరం కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. అక్రమాలను ప్రజలకు తెలియజేయాలనే జన్వాడ ఫాంహౌస్ కు వచ్చామని తెలిపారు. ఫాంహౌస్ ను నాలాపై కట్టారని.. దీని నిర్మాణానికి అనుమతులు లేవన్నారు. ఫాంహౌస్ ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదని మల్లు రవి అన్నారు.

**ఇన్ని ఎకరాల్లో ఫాంహౌస్ ఎలా కట్టారు - చామల కిరణ్ కుమార్ రెడ్డి**

ఫాంహౌస్ దగ్గరకు వస్తే ప్రదీప్ రెడ్డి కేసులు పెడతామన్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ అన్నారు. అసలు ఇన్ని ఎకరాల్లో ఫాంహౌస్ ఎలా కట్టుకున్నారని ప్రశ్నించారు. జన్వాడ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ ఎగరవేస్తే రేవంత్రెడ్డిపై కేసు పెట్టారని మండిపడ్డారు. కేటీఆర్ స్నేహితుడే ప్రదీప్డ్డి అని.. ఆయనకు ఫాంహౌస్ భూమి ఎలా వచ్చిందని నిలదీశారు. కేటీఆర్ జన్వాడ ఫాంహౌస్లో అద్దెకు ఉంటున్నారని ప్రదీప్ చెప్పారని తెలిపారు. పురపాలక మంత్రిగా కేటీఆర్ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. అక్రమంగా జన్వాడలో ఫాంహౌస్ నిర్మించారని ఆరోపణలు గుప్పించారు. సత్యం రామలింగరాజు భూముల్లో ఫాంహౌస్ నిర్మించారని తెలిపారు. ఈ భూములన్నీ శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీవి అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ,ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్,మనోహర్ రెడ్డి,ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి,అనిల్ యాదవ్, మల్లు రవి, బలరాం నాయక్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్,అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



# చౌటుప్పల్‌లో యువతకు ఉద్యోగావకాశాల వేదిక

- ఈఎల్‌వీ ఫౌండేషన్ మెగా జాబ్ మేళా సక్సెస్
- భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ మేళాలు,నైపుణ్య శిక్షణలను నిర్వహిస్తాం
- ఇరుగుదిండ్ల భాస్కర్,ఈఎల్వి ఫౌండేషన్ చైర్మన్

**చౌటుప్పల్,సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ ఈఎల్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా ఘనంగా విజయవంతమైంది.
ఫౌండేషన్ చైర్మన్ ఈఎల్‌వీ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు చౌటుప్పల్ తో పాటు చుట్టుపక్కల మండలాల నుండి వందలాది మంది నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.
ప్రముఖ ప్రైవేట్ సంస్థలు, ఐటీ, ఫార్మా, మార్కెటింగ్, ఫైనాన్స్ తదితర రంగాలకు చెందిన 20కి పైగా కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. అక్కడికక్కడే పలువురికి ఆఫర్ లెటర్లు కూడా అందజేశారు.
ఈ సందర్భంగా ఈఎల్‌వీ భాస్కర్ మాట్లాడుతూ "యువతే దేశానికి భవిష్యత్తు. చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఈఎల్‌వీ ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువతకు సరైన వేదిక కల్పించి, వారిని ప్రయోజకులను చేయడమే మా లక్ష్యం. ఇది కేవలం ఆరంభం మాత్రమే, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ మేళాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం" అని తెలిపారు.
ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న ఈఎల్‌వీ ఫౌండేషన్ కృషిని స్థానిక ప్రజలు, విద్యార్థులు, యువత అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈఎల్‌వీ భాస్కర్ టీం సభ్యులు,వివిధ కంపెనీల హెచ్ ఆర్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



- ఎమ్మెల్యే కాలే యాదయ్య

**మొయినాబాద్, సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని చేవెళ్ల నియోజకవర్గ శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు. షాబాద్ మండల ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజ నిర్మాణంలో, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే కాలే యాదయ్య కొనియాడారు. కేవలం చదువు చెప్పడమే కాకుండా భావితరాలకు మంచి మార్గనిర్దేశం చేస్తూ సంస్కారవంతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువులందరి కృషి అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

**మొయినాబాద్, సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేర్చాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలో స్థానిక సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో మండల స్థాయి ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై కూలంకషంగా చర్చించి, తక్షణ పరిష్కార మార్గాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని కరెంటు సమస్యలు, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం వంటి అంశాలపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్షించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూసే బాధ్యత అధికారులపై ఉందని, అలాగే ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న వీధి కుక్కల బెడదను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నవీన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎలిగని వెంకటేష్ గౌడ్‌తో పాటు కాసింహౌలి, అండాపూర్, కేతిరెడ్డి పల్లి, కనకమామిడి, చందానగర్, రెడ్డిపల్లి, చిన్న మంగళారం, అప్పారెడ్డి గూడ తదితర గ్రామాల సర్పంచులు ఈ సమావేశంలో పాల్గొని తమ ప్రాంతాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు .ఈ సమావేశంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నవీన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎలిగని వెంకటేష్‌గౌడ్, కాసింహౌలి సర్పంచ్ మాడి రాజేందర్ రెడ్డి, అండాపూర్ సర్పంచ్ మధ్యపాన కృష్ణ, వెంకటాపురం, కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గొడుగు యాదయ్య, కనకమామిడి సర్పంచ్ దివ్య, చందానగర్ సర్పంచ్, రెడ్డిపల్లి సర్పంచ్ కుతుపుదిను, చిన్న మంగళారం, అప్పారెడ్డి గూడ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.




# సింగిల్ విండో చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఈడుదుల మస్తాన్ బాబు

- అభినందనలు తెలిపిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి

**చౌటుప్పల్,సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

మునుగోడు నియోజకవర్గంలో రైతులకు అండగా నిలిచే సింగిల్ విండో వ్యవస్థకు నూతన నాయకత్వం వచ్చింది.మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన ఈడుదుల మస్తాన్ బాబు ఘనంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు నూతనంగా ఎన్నికైన పాలకవర్గ డైరెక్టర్లు కూడా ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి నూతన చైర్మన్ మస్తాన్ బాబును మరియు పాలకవర్గ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆకుల ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ"మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి. సింగిల్ విండో అనేది రైతులకు నేరుగా సంబంధించిన వ్యవస్థ. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, రుణాలు సకాలంలో అందేలా చూడాలి. రైతులకు నిస్వార్థంగా సేవలందించి వారి మన్ననలు పొందాలని, పార్టీకి, ప్రజలకు మరింత చేరువ కావాలని" సూచించారు.
రైతుల అభివృద్ధికి సింగిల్ విండో ద్వారా అన్ని రకాల సేవలు, సహకారం అందించడంలో నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.
అనంతరం నూతన చైర్మన్ ఈడుదుల మస్తాన్ బాబు మాట్లాడుతూ...తనపై నమ్మకంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి, తనకు అండగా నిలిచిన ఆకుల ఇంద్రసేనారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని, సింగిల్ విండోను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



# పుట్టపాకలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను గ్రామశాఖ అధ్యక్షుడు గజం సత్యనారాయణ లబ్ధిదారులకు అందజేశారు.
ఈ సందర్భంగా అయితరాజు యాదయ్యకు రూ.56,000, అయితరాజు పార్వతమ్మకు రూ.43,500, కొలను లక్ష్మమ్మకు రూ.38,500, మెరుగు అండాలకు రూ.21,500, దేప దామోదర్ రెడ్డికి రూ.18,000 చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. అత్యవసర వైద్య చికిత్సలు, ఇతర అవసరాల సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడం పట్ల లబ్ధిదారులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.
ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో గంజి కృష్ణయ్య, కానుగుల యాదయ్య,గజం రమేష్,గజం నర్సింహ,గంజి వెంకటేశం,నడికుడి లింగయ్య, బాతరాజు లింగయ్య,పెంబల్ల కృష్ణ,డాక్టర్ గంజి వెంకటేశ్వర్లు, పగిడిమర్రి భావనాఋషి,గజం మధు ,గోలి సాంబయ్య, బాతరాజు లక్ష్మణ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# తిమ్మారెడ్డిపల్లి లో గణపయ్యకు ఘనంగా వీడ్కోలు

- సర్పంచ్ అంతగిరిపల్లి ప్రభాకర్

**నవాబుపేట్, సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

నవాబుపేట్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన నిమజ్జన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, యువకులు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు భజన పాటలు పాడుతూ, యువకులు ఉత్సాహంగా పాల్గొనగా, మహిళలు కోలాటం ఆడుతూ సందడి చేశారు. గణపతి నామస్మరణలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామస్తులు శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రభాకర్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల కష్టాలు పట్టించుకోని మినిస్టర్ వాకిటి శ్రీహరి

- జూరాల ఎడమకాలపై సాగునీరు విడుదల చేయాలని రైతన్నలు ధర్నా

**అమరచింత, సెప్టెంబర్ 19( ప్రజాక్షేత్రం ):**

అమరచింత మండలం జూరాల ప్రాజెక్టు రైతులు ధర్నా పంట పొలాలు ఎండిపోతున్నాయని వారబంది ప్రకారం నీటిని విడుదల చేయాలని రైతాంగం రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుతుంది అలాగే మినిస్టర్ వాకిటి శ్రీహరి రైతు సంఘాలు అడుగుతున్నాయి ఎన్నికలు రైటంగానికి అండగా ఉంటానని మాట ఇచ్చి ఈ పొద్దు మోసం చేస్తున్న మినిస్టర్ వాకిటి శ్రీహరి రైతు సంఘాలు రైతుల ఆవేదన పట్టించుకోని మినిస్టర్ మాకొద్దు అని రైతులు వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులు రైతులు సర్పంచ్ దొమ్మ శ్రీనివాస్ రెడ్డి,గుంటిపల్లె సర్పంచ్ లక్ష్మన్న డైరెక్టర్ రాములు,రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆమెడ లింగన్న.

- దేగాం గ్రామంలో హర్షా తిరేకాలు, శుభాకాంక్షల వెల్లువ.

**నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

భైంసా,భారతీయ జనతా పార్టీ,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా భైంసా మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ప్రముఖ నాయకుడు, రైతు బిడ్డ ఆమెడ లింగన్న నియామకమయ్యారు.ఈ మేరకు పార్టీ అధిష్టానం శనివారం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ముథోల్ నియోజకవర్గ శాసనసభ్యులు రామారావు పటేల్ కు అత్యంత నమ్మినబంటుగా, ముఖ్య అనుచరుడిగా పేరు గాంచిన లింగన్నకు ఈ కీలక పదవి దక్కడం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రైతు దేగాం గ్రామానికి చెందిన సాధారణ వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన ఆమెడ లింగన్న.. మొదటి నుండి క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలపై నిరంతరం పోరాడుతు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ నేతృత్వంలో బిజెపి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన నిరంతర శ్రమ, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించిన అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించింది ఈ సందర్భంగా దేగాం గ్రామస్తులు, పార్టీ శ్రేణులు ఆమెడ లింగన్నకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆశీస్సులతో లింగన్న భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని, ఈ ప్రాంత రైతాంగ సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ నియామకం పట్ల బిజెపి కిసాన్ మోర్చా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



# చేనేత సొసైటీ లో జరిగిన 51కోట్ల అవినీతిపై లోకాయుక్తకు పిర్యాదు.

**నారాయణ పేట పట్టణం సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం ):**

జిల్లాకేంద్రంలోని చేనేత సొసైటీలలో జరిగిన 51కోట్ల అక్రమ లావాదేవీలపై తక్షణమే విచారణ జరిపించి,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జన సేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి హైందవి రెడ్డి,బహుజన్ సమాజ్ పార్టీ (బి ఎస్ పి ) నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్, సీఐటీయు జిల్లా కార్యదర్శి బాల్ రామ్,చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కెంచె నారాయణ శనివారం నాడు హైదరాబాద్ లోని లోకాయుక్తలో పిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలో సుమారుగా 5వేల మంది చేనేత కార్మికులకు అన్యాయం జరుగుతుంటే జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జౌళి శాఖ అధికారులపై గౌరవ హై కోర్టు అక్రమ లావాదేవీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించినా జిల్లా కలెక్టర్ గారు,జౌళి శాఖ అధికారుల నుండి కనీస స్పందన లేదన్నారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్మును లూటీ చేసి,కార్మికులకు అన్యాయం జరుగుతుంటే స్థానిక ప్రభుత్వ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే అక్రమ లావాదేవీలపై విచారణ జరిపి,సొసైటీ అధ్యక్ష,కార్యదర్శులపై చర్యలు తీసుకొని 51 కోట్ల రూపాయల డబ్బులను రికవరీ చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.



# కలెక్టర్ భవేష్ మిశ్రా సహకారంతో ఉచిత పోలీస్ శిక్షణ తరగతులు.

- ఎస్పీ డా. జానకి షర్మిల

**నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**



నిర్మల్ టౌన్, పోలీస్ ఉద్యోగమే లక్ష్యంగా శ్రమిస్తూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిర్మల్ జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా పోలీసు శాఖ అండగా నిలిచింది. వారి కలలను సాకారం చేసేందుకు ఉచిత ప్రిరిక్రూట్‌మెంట్ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ప్రత్యేక సహకారంతో, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆమె వెల్లడించారు.ఈ శిక్షణ తరగతులు ఈ నెల 28వ తేదీ సోమవారం నుంచి నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రారంభం కానున్నాయని ఎస్పీ స్పష్టం చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులు భారీగా ఫీజులు చెల్లించి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్లలేక ఇబ్బందులు పడుతుంటారని, అలాంటి వారిని ప్రోత్సహించేందుకే ఈ ఉచిత శిక్షణను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో పోటీ పరీక్షల సిలబస్‌కు అనుగుణంగా తరగతులు ఉంటాయని, అభ్యర్థులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.అర్హులైన అభ్యర్థులు వెంటనే సంప్రదించాలి:శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాలు, నమోదు ప్రక్రియ కోసం అభ్యర్థులు నిర్మల్‌లోని జిల్లా పోలీసు కార్యాలయాన్ని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# శంకర్‌పల్లి 7వ వార్డులో శివసేన యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

**శంకర్ పల్లి సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి మున్సిపాలిటీ 7వ వార్డు గంజి రోడ్‌లో చిన్నారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న శివసేన యూత్ గత ఐదు సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో గణపతి మండపాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా శనివారం గణపతి మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు, వారి తల్లిదండ్రుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు చిన్నారుల పాఠశాల ఉపాధ్యాయులు కూడా హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమంలో చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా "జై బోలో గణేష్ మహారాజ్‌కి జై" అంటూ చిన్నారులు చేసిన నినాదాలతో గంజి రోడ్ పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.



## గంగసాగర్‌లో దళిత యువకులపై దాడి.

- కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఆగ్రహం.
- నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్.

**తాండూర్, సెప్టెంబర్ 19 (ప్రజాక్షేత్రం):**

వినాయక నిమజ్జన ఊరేగింపు సందర్భంగా యాలాల మండలం గంగసాగర్ గ్రామంలో దళిత యువకులపై జరిగిన దాడిని ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్లయ్య, సీటీయూ జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్, పీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి. ఆనంద్‌కుమార్ పరామర్శించారు.

బాధితుల ఫిర్యాదు ప్రకారం వినాయక నిమజ్జన ఊరేగింపులో డీజే ముందు దళిత యువకులు నృత్యం చేయడం, విరాళాల విషయంలో జరిగిన వివాదం నేపథ్యంలో కొందరు వారిని కులం పేరుతో దూషించి కత్తులతో దాడి చేసినట్లు నాయకులు ఆరోపించారు. ఈ ఘటనలో పలువురు యువకులు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని, బాధితులకు మెరుగైన ఉచిత వైద్యం, ప్రభుత్వ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు పోలీస్ రక్షణ కల్పించి, ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు.ఘటన జరిగిన అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు పోలీసులు గ్రామాన్ని సందర్శించకపోవడం బాధాకరమని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



## మహిళలు జిజియ బాయి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

ప్రతి మహిళ జిజియ బాయి స్ఫూర్తితో, ప్రతి యువకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ముందుకు సాగినప్పుడే సనాతన ధర్మం, హిందూ సంస్కృతి మరింత వెలుగొందుతాయని భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, చేవెళ్ల మరకత శివలింగ నామకరణ భక్తులు, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్. నరేష్ కుమార్ పిలుపునిచ్చారు.

శుక్రవారం రాత్రి అనంతగిరి జిల్లా వికారాబాద్‌లోని శివాజీనగర్ బాలభక్త సమాజం కట్ట మైసమ్మ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నవరాత్రి గణేష్ మండపం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా, ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆర్. నరేష్ కుమార్ మాట్లాడుతూ.. తొలి పూజలందుకునే విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ కాలం నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. అనంతరం లోకమాన్య బాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాలను ప్రజలను ఒక వేదికపైకి తీసుకువచ్చే కార్యక్రమంగా మలిచి, స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు.

ప్రతి మహిళ రుద్రమదేవి, జిజాబాయి వంటి మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని, యువత సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వంటి దేశభక్తుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వికారాబాద్ మాజీ బీజేపీ అధ్యక్షులు, సేంద్రియ వ్యవసాయ బోధకులు, భగవద్గీత పారాయణ నిర్వాహకులు సదానంద రెడ్డి, ఆయన సతీమణి శ్రీదేవి మాట్లాడుతూ.. పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తూ, చేవెళ్ల మరకత శివలింగ నామకరణ భక్తుడిగా ఆలయ నిర్మాణ కార్యక్రమాల్లో సేవలందిస్తున్న ఆర్. నరేష్‌కుమార్ చేస్తున్న సనాతన ధార్మిక సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవలు మారుమూల గ్రామాలకు విస్తరించినప్పుడే ప్రజల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక చైతన్యం మరింత పెరుగుతుందని అన్నారు.అనంతరం ఆర్. నరేష్ కుమార్‌ను ఘనంగా సన్మానించి గౌరవించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జన్వాడ ఫామ్ హౌస్‌కు కాంగ్రెస్ నేతలు..భారీగా పోలీసు మోహరింపు

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**



జన్వాడలోని ఫామ్ హౌస్ వ్యవహారం మరోసారి రాజకీయంగా వేడెక్కింది. ఫామ్ హౌస్‌ను సందర్శించేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం శనివారం అక్కడికి చేరుకుంది. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫామ్ హౌస్ నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. ఫామ్ హౌస్ వెనుక ఉన్న అక్రమాలను ప్రజలకు తెలియజేయడానికే తాము వచ్చామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ బృందం భూముల రికార్డులు, పట్టాదారు వివరాలను పరిశీలించింది. కాంగ్రెస్ నేతల రాకను నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. శంకర్‌పల్లి ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కూడా ఫామ్ హౌస్ వద్దకు చేరుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్త సిరిగన్న శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు వస్తున్న బస్సును అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. రాజకీయ కారణాలతో కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు గండేటి గోవర్ధన్ రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు బద్దం శశికాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఫామ్ హౌస్ తనదేనని, కేటీఆర్‌కు లీజుకు ఇచ్చానని యజమాని ప్రదీప్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జన్వాడలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ బృందంలో ఎంపీ మల్లు రవి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ తదితరులు ఉన్నారు.

# దానం తీర్పుతో తెలంగాణ రాజకీయాల్లో భూకంపం

- **స్పీకర్ తీర్పును పక్కనపెట్టిన హైకోర్టు.**
- **ఖైరతాబాద్ సీటు ఖాళీ.. సుప్రీంకోర్టు గడప తొక్కిన దానం.**
- **ఒక్క ఎమ్మెల్యేపై తీర్పా? లేక పార్టీ ఫిరాయింపులపై కొత్త రాజ్యాంగ అధ్యాయమా?**

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న అనర్హత వేటు వేయడంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు పక్కనపెట్టి, దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ప్రకటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అయితే తీర్పు వెలువడిన వెంటనే దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఇప్పుడు అందరి చూపు దేశ అత్యున్నత న్యాయస్థానంపైనే ఉంది.

**పార్టీ మారితే పదవి పోతుందా?**

పదో షెడ్యూల్ అసలు పరీక్ష ఇప్పుడు తెలంగాణలోనే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఉద్దేశ్యం ఎన్నికల అనంతరం ప్రజాప్రతినిధులు పార్టీ మారడం ద్వారా రాజకీయ సమీకరణాలను మార్చే పరిస్థితిని నియంత్రించడం. అయితే ఒక ఎమ్మెల్యే నిజంగా తన పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదిలేశాడా? లేక పార్టీతో సంబంధాలు కొనసాగుతూనే మరో రాజకీయ పార్టీతో కార్యక్రమాలు నిర్వహించాడా? అన్నది ప్రతి కేసులో పరిశీలించాల్సిన అంశం. అందుకే దానం నాగేందర్ కేసు కేవలం కాంగ్రెస్‌బీఆర్ఎస్ రాజకీయ వివాదం కాకుండా రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ అమలుపై జరుగుతున్న న్యాయపరీక్షగా మారింది.

**2023లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే.. 2024లో కాంగ్రెస్ అభ్యర్థి దానం రాజకీయ ప్రయాణంలో కీలకమైన మలుపు**

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటికి ఆయన ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ చర్యనే దానం నాగేందర్ బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదిలేసినట్లు నిర్ధారించడానికి ప్రధాన ఆధారంగా హైకోర్టు పరిగణించింది.

**2024లో మొదలైన అనర్హత పోరాటం స్పీకర్ గడప నుంచి హైకోర్టు వరకు సాగిన న్యాయపోరాటం**

దానం నాగేందర్‌తో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన పలువురు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. దానం నాగేందర్‌పై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్లపై నిర్ణయం ఆలస్యం కావడంతో వ్యవహారం హైకోర్టుకు చేరింది. అక్కడి నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లిన ఈ వ్యవహారం చివరకు స్పీకర్ విచారణకు దారితీసింది.

**2025 జూలై 31 — సుప్రీంకోర్టు కీలక ఆదేశం "స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి" — మూడు నెలల గడువు**

2025 జూలై 31న సుప్రీంకోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. పార్టీ ఫిరాయింపు కేసుల్లో స్పీకర్ నిర్ణయాలు న్యాయ సమీక్షకు పూర్తిగా అతీతం కావని కూడా ఈ న్యాయపరమైన పరిణామం స్పష్టం చేసింది. దీంతో తెలంగాణ అసెంబ్లీపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత స్పష్టంగా పడింది.

**2026 మార్చి 11 — స్పీకర్ తీర్పు పది మందికీ అనర్హత లేదు.. పిటిషన్లు తిరస్కరణ**

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలోని ట్రిబ్యునల్ అనర్హత పిటిషన్లను విచారించింది. 2026 మార్చి 11న దానం నాగేందర్‌తో పాటు మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై వచ్చిన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ నిర్ణయం వెలువడింది. దీంతో ఆ సమయంలో పది మంది ఎమ్మెల్యేలూ తమ శాసనసభ సభ్యత్వాలను కొనసాగించారు. అక్కడితో వివాదం ముగిసిందని అనుకున్న సమయంలో అసలు మలుపు వచ్చింది.

**స్పీకర్ తీర్పును హైకోర్టు ఎందుకు పక్కనపెట్టింది? "రాజకీయ ప్రవర్తన కూడా ఆధారమే" — దానం కేసులో కీలక న్యాయవిశ్లేషణ**

2026 సెప్టెంబర్ 18న తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ కేసులో స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టింది. 2024 ఏప్రిల్ 23న కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేసి ఎన్నికల్లో పోటీ చేయడాన్ని హైకోర్టు కీలక అంశంగా పరిగణించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి మరో పార్టీ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు నిర్ధారించవచ్చని కోర్టు పేర్కొంది.

**స్పీకర్ ఒకటి.. హైకోర్టు మరొకటి ఒకే కేసులో రెండు భిన్నమైన న్యాయ దృక్కోణాలు**

స్పీకర్ పరిశీలనలో దానం నాగేందర్ పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు నిర్ధారించేంత బలమైన ఆధారాలు లేవని నిర్ణయించారు. మరోవైపు హైకోర్టు మాత్రం ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన చర్యను కీలక ఆధారంగా తీసుకుంది. ఇక్కడే ఈ కేసు రాజ్యాంగపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**స్పీకర్ నిర్ణయం అంతిమమా? న్యాయస్థానం ఎంతవరకు జోక్యం చేసుకోగలదు?అనే ప్రశ్న ఇప్పుడు కేంద్రంగా మారింది.**

**ఖైరతాబాద్ సీటు ఖాళీ ఉపఎన్నికకు మార్గం తెరుచుకున్నదా?**

హైకోర్టు తీర్పు ప్రకారం దానం నాగేందర్ అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచే అమల్లోకి వస్తుందని ప్రకటించింది. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించేందుకు తీర్పు కాపీని ఎన్నికల సంఘానికి, అసెంబ్లీ స్పీకర్‌కు పంపాలని ఆదేశించింది. అయితే దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఉపఎన్నిక వెంటనే జరుగుతుందని ఖచ్చితంగా చెప్పలేం.

**దానం సుప్రీంకోర్టు గడప తొక్కారు**

స్టే వస్తుందా? తీర్పు నిలుస్తుందా? ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం వైపు చూపులు

హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పు అమలుపై స్టే కోరినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఆయనకు వ్యతిరేకంగా పిటిషనర్లు కూడా సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసినట్లు సమాచారం. అంటే దానం పిటిషన్‌పై ఏదైనా తాత్కాలిక ఉత్తర్వు ఇచ్చే ముందు తమ వాదన కూడా వినాలని వారు కోరుతున్నారు.

**మిగతా తొమ్మిది మందికి వేటు తప్పదా? దానం తీర్పు ప్రభావం ఉంది.. కానీ ఆటోమేటిక్ అనర్హత లేదు**

ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చ. దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసిందని కారణంగా మిగతా తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై కూడా అదే విధంగా వెంటనే వేటు పడదు. ప్రతి ఎమ్మెల్యే కేసును వేర్వేరుగా పరిశీలించాల్సి ఉంటుంది. వారి రాజకీయ చర్యలు, ఆధారాలు, స్పీకర్ ముందు జరిగిన విచారణ, హైకోర్టులో ఉన్న పిటిషన్లు అన్నీ విడిగా పరిగణనలోకి రావాలి.

అయితే దానం కేసులో హైకోర్టు నిర్దేశించిన న్యాయ ప్రమాణాలు మిగతా కేసుల్లో పిటిషనర్లకు ముఖ్యమైన వాదనగా మారే అవకాశం మాత్రం ఉంది.

**ఆ పది మంది ఎవరు? ఇప్పుడు ఒక్కొక్కరి కేసుపైనే రాజకీయ-న్యాయ దృష్టి**

దానం నాగేందర్‌తో పాటు కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, ఆరెకపూడి గాంధీ, టి. ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, ఎం. సంజయ్‌కుమార్ పార్టీ ఫిరాయింపు ఆరోపణలను ఎదుర్కొన్న ఎమ్మెల్యేలుగా ఈ వ్యవహారంలో ఉన్నారు.

స్పీకర్ వీరి అనర్హత పిటిషన్లను తిరస్కరించినప్పటికీ, దానం కేసులో వచ్చిన హైకోర్టు తీర్పు నేపథ్యంలో మిగతా కేసులపై కూడా న్యాయపరమైన చర్చ మరింత పెరిగింది.

**దానం కేసు మిగతా ఎమ్మెల్యేలకు హెచ్చరికా? తీర్పు ఒక్కటే.. కానీ ప్రతి కేసు వేరు**

దానం కేసును మిగతా తొమ్మిది కేసులకు నేరుగా వర్తింపజేయడం న్యాయపరంగా సరైంది కాదు. అదే సమయంలో దానం కేసులో కోర్టు పరిగణనలోకి తీసుకున్న రాజకీయ ప్రవర్తన, ఎన్నికల్లో మరో పార్టీ తరఫున పోటీ చేయడం వంటి అంశాలు మిగతా కేసుల్లో కూడా ఏ మేరకు ఉన్నాయన్నది పరిశీలనకు రావచ్చు.

అందుకే ఇప్పుడు మిగతా ఎమ్మెల్యేల విషయంలో "వేటు పడుతుంది" అని కూడా చెప్పలేం, "వేటు పడదు" అని కూడా ముందుగానే చెప్పలేం. కోర్టు తీర్పులే తుది దిశను నిర్ణయిస్తాయి.

**కాంగ్రెస్‌కు రాజకీయ పరీక్ష**

పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిగా మారే అవకాశం పది మంది ఎమ్మెల్యేల పార్టీ మార్పు అంశం చాలా కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ విమర్శలకు కారణమవుతోంది. ఇప్పుడు దానం నాగేందర్‌పై హైకోర్టు తీర్పు రావడంతో మిగతా కేసులపై కూడా రాజకీయ ఒత్తిడి పెరగవచ్చు. అయితే న్యాయస్థానాల్లో జరుగుతున్న ప్రక్రియను రాజకీయ ప్రకటనలతో ముందే నిర్ణయించడం సాధ్యం కాదు.







**బీఆర్ఎస్‌కు న్యాయపోరాటంలో కొత్త బలం "పార్టీ మారినవారిపై చర్య" అనే అంశం మరింత ముందుకు**

దానం నాగేందర్‌పై వచ్చిన హైకోర్టు తీర్పు బీఆర్ఎస్‌కు పార్టీ ఫిరాయింపుల అంశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం కల్పించింది. అయితే మిగతా ఎమ్మెల్యేల విషయంలో కూడా ఇదే తీర్పు వస్తుందా లేదా అన్నది ఇంకా న్యాయపరంగా తేలాల్సి ఉంది.

**బీజేపీ కూడా న్యాయపోరాటంలో ముందుంది**

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్ నుంచి సుప్రీంకోర్టు కేవియట్ వరకు దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ దాఖలు చేసిన వారిలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కూడా ఈ వ్యవహారంలో పిటిషనర్‌గా ఉన్నారు. హైకోర్టు తీర్పు తరువాత సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేయడం ద్వారా తదుపరి న్యాయపోరాటంలో తమ వాదనను వినిపించేందుకు వారు సిద్ధమయ్యారు. ఉపఎన్నిక వస్తే ఖైరతాబాద్ మళ్లీ రాజకీయ కేంద్రంగా మారనుంది

**అభ్యర్థుల కంటే ముందు కోర్టు తీర్పే కీలకం**

ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక జరిగితే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీలకు అది ముఖ్యమైన రాజకీయ పోటీగా మారుతుంది. కానీ ప్రస్తుతం ఎవరు గెలుస్తారనే ప్రశ్నకు ముందుగానే సమాధానం చెప్పడం సాధ్యం కాదు. అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సమయం, సుప్రీంకోర్టు ఆదేశాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, ఓటర్ల నిర్ణయం——ఇవన్నీ ఫలితాన్ని ప్రభావితం చేసే అంశాలు.

**ఇది దానం కేసు మాత్రమే కాదు తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల భవిష్యత్తుకు ఇది ఒక కీలక పరీక్ష**

దానం నాగేందర్ కేసు ద్వారా తెలంగాణలో ఒక పెద్ద రాజ్యాంగ ప్రశ్న ముందుకొచ్చింది. ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే పార్టీ మారితే ఏ దశలో అనర్హత వర్తిస్తుంది? ఒక పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే మరో పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తే దానిని సభ్యత్వ విరమణగా ఎలా పరిగణించాలి? స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు ఎంత వరకు సమీక్షించగలదు? ఈ ప్రశ్నలకు దానం కేసు న్యాయపరమైన దిశను చూపే అవకాశం ఉంది.

**ఇక ముందున్న అసలు పోరాటం హైకోర్టు తీర్పు తర్వాత సుప్రీంకోర్టు నిర్ణయం.. ఆ తర్వాతే ఖైరతాబాద్ భవిష్యత్తు**

ప్రస్తుతం మూడు దశలు కీలకం. మొదటిది——దానం నాగేందర్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందన. రెండోది——ఖైరతాబాద్ ఖాళీ స్థానంపై ఎన్నికల సంఘం తీసుకునే చర్య. మూడోది——మిగతా తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న న్యాయపోరాటం.

ఈ మూడు అంశాల్లో ఏ ఒక్కటి ముందుగా ఏ దిశలో కదులుతుందో చెప్పడం కష్టం. కానీ ఒక్క విషయం మాత్రం స్పష్టం——తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల రాజకీయానికి ఇప్పుడు న్యాయపరమైన కొత్త అధ్యాయం మొదలైంది.

**ప్రజల తీర్పు — రాజకీయ నాయకుల నిర్ణయం**

**చివరికి నిర్ణయించేది ఎవరు?**

ఎన్నికల్లో ఓటర్లు ఒక పార్టీ గుర్తుపై తమ ఓటు వేస్తారు. ఎన్నికల తరువాత ప్రజాప్రతినిధి పార్టీ మారితే అది కేవలం నాయకుడి వ్యక్తిగత రాజకీయ నిర్ణయమా? లేక ఓటర్లు ఇచ్చిన తీర్పును ప్రభావితం చేసే చర్యనా? అన్నది ప్రజాస్వామ్యంలో ఎప్పటికీ చర్చించాల్సిన ప్రశ్న. పదో షెడ్యూల్ ఈ సమస్యకు ఒక రాజ్యాంగపరమైన నియంత్రణను అందించింది. కానీ దాని అమలులో స్పీకర్ నిర్ణయం, న్యాయ సమీక్ష, రాజకీయ వాస్తవాలు——మూడూ కలిసి పని చేస్తున్నాయి.

**ఒక ఎమ్మెల్యేపై వేటుతో మొదలైన ప్రశ్న.. పది మంది భవిష్యత్తుపై నిలిచిన చూపులు**

దానం నాగేందర్‌పై హైకోర్టు తీర్పు తెలంగాణ రాజకీయాల్లో సాధారణ న్యాయవార్త కాదు. ఇది పార్టీ ఫిరాయింపుల చట్టం ఎంత బలంగా పనిచేస్తుంది, స్పీకర్ నిర్ణయానికి న్యాయ సమీక్ష ఎంతవరకు ఉంటుంది, ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన పార్టీ ఆధారిత తీర్పుకు ఎంత ప్రాధాన్యం ఉంటుంది అనే ప్రశ్నలను మరోసారి ముందుకు తెచ్చింది.

2025 జూలై 31న సుప్రీంకోర్టు స్పీకర్‌ను నిర్ణయం తీసుకునేలా చేసింది. 2026 మార్చి 11న స్పీకర్ పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను తిరస్కరించారు. 2026 సెప్టెంబర్ 18న హైకోర్టు దానం నాగేందర్ విషయంలో ఆ నిర్ణయాన్ని పక్కనపెట్టి అనర్హత విధించింది. సెప్టెంబర్ 19న దానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**అంటే న్యాయ ప్రయాణం ఇంకా ముగియలేదు. దానం పడిపోయాడా? — హైకోర్టు తీర్పు ప్రకారం అవును.**

ఆ తీర్పు తుది అయిపోయిందా? —— కాదు సుప్రీంకోర్టు ముందు సవాలు కొనసాగుతోంది. మిగతా ఎమ్మెల్యేలపై వేటు పడుతుందా? —— ఇప్పుడే ఖచ్చితంగా చెప్పలేం.

దానం తీర్పు వారికి ప్రభావం చూపుతుందా? —— న్యాయపరమైన వాదనల్లో ప్రభావం చూపే అవకాశం ఉంది; కానీ ప్రతి కేసుకు తుది నిర్ణయం విడిగా రావాల్సిందే.

ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక వస్తుందా? —— హైకోర్టు స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది; అయితే సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు కీలకం. ఇప్పుడు తెలంగాణ రాజకీయాల చూపు ఖైరతాబాద్‌పై కాదు——సుప్రీంకోర్టుపైనే.

అక్కడి నుంచి వచ్చే తదుపరి ఆదేశాలే దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తుకు, ఖైరతాబాద్ ఉపఎన్నికకు, అలాగే మిగతా పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కొనసాగుతున్న న్యాయపోరాటానికి తదుపరి దిశను నిర్దేశించనున్నాయి.




**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**7901503777**

## వినాయక పూజా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ సురేందర్ గౌడ్

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం భక్తుల కోసం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరై భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ వినాయక నవరాత్రులను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం పెంపొందుతాయని అన్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, శ్రీ వినాయకుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, యువత, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394